హనీబీ

సంపుటి 4,  సంచిక 5

మార్చి-ఏప్రిల్ 2016

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org

## పునాది స్థాయి ఇన్నోవేటర్ల మేధో సంపత్తి హక్కుల పరిరక్షణలో



## నేషనల్ ఇన్నోవేషన్  ఫౌండేషన్ పాత్ర

# కట్టుబాట్లకన్న వ్యక్తులు ముఖ్యం



ఒకరోజు ఓ సన్యాసి 'క్రైటో' నగరం నుండి 'హోయి'లోని మందిరం వరకు వంద రోజుల్లో వెళ్ళి రావాలని నిర్ణయించుకొని బయలుదేరాడు. ఆయన ప్రయాణంలో వుండగా ఒక స్త్రీ దుఃఖిస్తూ ఆయనకు కనిపించింది. అతను కుతూహలాన్ని ఆపుకోలేక ఆమె క్లేశానికి కారణం అడిగాడు. 'నువ్వేం చేయగలవులే నాయనా బాటసారివి' అన్నదామె. కాని కొంచెం బుజ్జగించిన తర్వాత ఆమె కారణం చెప్పింది. 'మా అమ్మ చాలాకాలంగా అనారోగ్యంతో వుండి ఈ ఉదయమే చనిపోయింది. నాకేం చేయాలో తోచటం లేదు, శవాన్ని ఎలా తీయాలో నాకు తెలియటం లేదు, నేను ఒంటరి దాన్ని. మా పొరుగు వారంతా పండుగ హడావిడిలో వున్నారు, వారు నాకు సహాయం చేసే పరిస్థితిలో లేరు' అన్నది.

ఆమె దీనగాథ సన్యాసిని కదిలించివేసింది. తాను ఆమెకి సహాయం చేస్తే మైలపడిపోయి తీర్థయాత్ర చేయటానికి వీలుండదు. ఇంతవరకు చేసిన ప్రయాణం వృధా అవుతుంది. కానీ, తన తీర్థయాత్రకన్నా ఆమె అవసరం ముఖ్యం అని నిర్ణయించుకొని ఆమెతో కలిసి కర్మకాండ పూర్తిచేశాడు.

కట్టుబాట్లు వీలులేదంటున్నా అతను యాత్రను కొనసాగించి మందిరాన్ని దర్శించాలనే నిర్ణయించుకున్నాడు. అతనక్కడికి చేరుకున్నాక కూడా తగదు అన్న భావన అతడ్ని పీడిస్తూనే వుంది. సాధారణం కన్నా ఎక్కువ భక్తులున్నారక్కడ. దివ్యవాణి సందేశం వినడానికి వచ్చారంతా.

దివ్యవాణి అక్కడున్న ఇతన్ని పిలిచింది. సన్యాసి పైకి చూస్తే తనకి ప్రయాణంలో కలిసిన స్త్రీ కళ్ళు కనిపించాయి. ప్రజలంతా కుతూహలంగా చూస్తూవుండగా ఆమెదగ్గరకి వెళ్ళాడు సన్యాసి. అప్పుడు దివ్యవాణి ఇలా అన్నది. "నువ్వు నిన్న రాత్రి ఏమిచేశావో నాకు తెలుసు" అన్నది. సన్యాసి నోరు తెరిచి ఏదో చెప్పబోయి తాను చేసిన పనికి వివరణ ఇవ్వలేకపోయాడు. నోరు పెగలలేదు. అప్పుడు దివ్యవాణి "చాలా అద్భుతమైన పనిచేశావు. కట్టుబాట్లు భక్తికన్నా ఎక్కువ కాదు. విజ్ఞులు ఎప్పుడు కట్టుబాట్లనుండి బైటకి రావాలో తెలుసుకుంటారు. కట్టుబాట్లు, నిబంధనలకన్నా మనుషులే ముఖ్యం" అన్నది. (1998 మెగాన్ సోవెల్)

– హనీబీ 10(2) – 1999

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 5 మార్చి - ఏప్రిల్ 2016

## ఈ సంచికలో...


- రైల్వేలో కోట్లాది రూపాయల పొదుపుకై నూరిన్ సృజన - 4
- పల్లెసృజన కుటుంబ సమావేశం - 8
- రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా నీటిని అందిస్తున్న పటాన్ సైదా గాలిమర పంపు - 12
- ఒక భారతీయ సగటు రైతు కథ - ధారావాహికం - 14
- 8వ ద్వైవార్షిక పోటీలు (ధారావాహికం) - 18
- మేథోసంపత్తి (పేటెంట్) యాజమాన్యం - 25
- పునాది స్థాయి ఇన్నోవేటర్ల మేథో సంపత్తి హక్కుల పరిరక్షణలో ఎన్.ఐ.ఎఫ్. పాత్ర - 28
- స్పందన - 32

కవర్ లోపలి పేజీల్లో ....

కట్టుబాట్లకన్నా వ్యక్తులు ముఖ్యం-హనీబీ కథ,

రైతుల కరకు రైతులు తయారు చేసిన విత్తనాలు

మధ్య పేజీ :

పల్లెసృజన కుటుంబ సమావేశం 30-31, జనవరి, 2016

ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు



### సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్ సిద్ధు



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678
E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# 'పల్లెసృజన' పదేళ్ళ ప్రయాణం : సింహావలోకనం

పదేళ్ళక్రితం 'పల్లెసృజన'ను చాలా ధైర్యంగా ప్రారంభించాం. ఎక్కడికి వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో తెలియకపోయినా ముందుకు సాగాం. ఒక్కటే నమ్మకం - పల్లెసృజన సమాజాభివృద్ధికి అత్యవసరం. దాన్ని వెలికి తీయటం ఒక బాధ్యతగా భావించి ముందుకు నడవాలపించిన మాకు ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారి హనీబీ నెట్‌వర్క్ స్ఫూర్తి. ఆర్మీలో ఇన్నోవేషన్‌లపై మేము చేసిన కృషి, అద్భుత ఫలితాలు, సామాన్య ప్రజల సృజనాత్మక శక్తిపై ఎంతో విశ్వాసాన్ని కలిగించాయి. ఈ నమ్మకంతో కొంత అహంకారం, కొంత వెర్రితనం, దృఢ విశ్వాసం, నిబద్ధత లాంటి మిశ్రమ లక్షణాలతో, అతిగా దేన్ని గురించి ఆలోచించకుండా, కొత్త ఆలోచనలతో, నూతన పంథాలను అడ్డుకోకుండా, ముందుకు సాగడమే ఈ పదేళ్ళ ప్రయాణంలో మేము వాడిన చిట్కా అందుకే ఎన్నో చిక్కుముడులు వాటంతట అవే విచ్చుకొని ముందుకు సాగ గలిగాము. మాకు ఈ గ్రాస్‌రూట్ (పునాది స్థాయి) ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావటానికి ఏం చేయాలో తెలియదు. సంస్థ, వాటిలో వ్యవస్థలు ఉండాలో అవగాహన లేదు, ఆలోచన లేదు. ఎటువైపు వెళ్ళాలో, ఏమి ఎదురవుతుందో అని ఆలోచించలేదు అయినా ముందుకు సాగాం. విరుద్ధ ఆలోచనలు, స్వేచ్ఛాగత, సంస్థాగత పరిణామాలే (ఎవల్యూషన్) 'పల్లెసృజన' ను ప్రస్తుత స్థాయికి తెచ్చాయి.

మొదట్లో గ్రామీణ ఇన్నోవేషన్‌లకు ప్రాధాన్యతనిచ్చాం. వాటిని వెతకడం, అభివృద్ధి చేయడం, టెక్నాలజీ పరంగా సహకారం అందించడం, ఇన్నోవేషన్లను వివిధ రంగాల వారికి పరిచయం చేయడం, ప్రదర్శనల్లో పాల్గొనడం, అవార్డులకై ప్రయత్నించడం, ఎన్.ఐ.ఎఫ్. సహాయాన్ని పూర్తిగా వినియోగించుకోవడం జరిగింది. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ సంస్థలకు, ప్రభుత్వానికి, పారిశ్రామిక సంస్థలకు, వ్యవసాయ రంగంలోని నిష్ణాతులకు గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లను పరిచయం చేయడానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాం. మొదటి మూడు సంవత్సరాల్లో ఈ రంగాల్లో కొంత ప్రగతిని సాధించగలిగాం. గ్రామాల్లో ఇన్నోవేటర్లను వెతకాలంటే వాలంటీర్లు కావాలి. విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేయాలని నిశ్చయించుకొని, కళాశాలలకు గ్రామీణ క్రియాశీలత గురించి, వారికి సాంకేతిక సహకారాన్ని అందించాలన్న అవసరం గురించి చెప్పడం ప్రారంభించాం. ఈ విధంగా మూడేళ్ళ తర్వాత కాలేజి విద్యార్థులతో సంధానం ప్రారంభమైంది. కొద్దికొద్దిగా విద్యార్థులు 'పల్లెసృజన' కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించారు. బిట్స్ పిలాని విద్యార్థులు 2009లో తెలుగు జిల్లాల్లో 15 రోజులు 'జ్ఞానశోధ' చేశారు. అందరికి అదొక అద్భుత అనుభవం. ఎన్.ఐ.టి. వరంగల్ విద్యార్థులు పల్లెసృజన కార్యక్రమాలపై ఎక్కువ శ్రద్ధ చూపడం మొదలెట్టారు. పల్లెసృజన కార్యక్రమాలను మరింతగా అర్థం చేసుకోవడానికి వారితో 2011లో 'చిన్నశోధయాత్ర' ప్రారంభించాం. ఇది చిన్నది ఎందుకైందంటే ప్రొఫెసర్ అనిల్ గుప్తా సారథ్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఏడు రోజులపాటు జాతీయ స్థాయిలో 'శోధయాత్ర' దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జరుగుతోంది. దీని స్ఫూర్తిగా మూడు రోజులపాటు జరిగేలా 'చిన్నశోధయాత్ర' మొదలైంది. ఏప్రిల్, 2016లో 18వ చిన్నశోధయాత్ర ప్రకాశం జిల్లాలో జరుగుతున్నది.



సాంకేతికపరమైన ఇన్నోవేషన్లకు వెళుతున్నపుడు సాంప్రదాయిక వైద్యం, పశువైద్యం, వంటల గురించి కూడా ప్రజలు మాతో పంచుకొన్నారు. దాంతో పల్లెసృజన సాంప్రదాయ జ్ఞానానికి కూడా ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించింది. ఈ క్రమంలో వెయ్యికి పైగా మూలికాపరమైన సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి గ్రంథస్తం చేసి ఎన్.ఐ.ఎఫ్. పోటీలకు పంపించాము. 2013లో 30 మంది మూలికా వైద్యులను రాష్ట్ర నలుమూలల నుండి రప్పించి రెండు రోజుల "మూలికా వైద్యుల సమావేశం" జరపడం, దానికి ఎన్.ఐ.ఎఫ్. సంపూర్తిగా సహకారం అందించడం, పంచుకున్న జ్ఞానంలో అయిదు సాంప్రదాయ జ్ఞానాలకు పేటెంట్లు నమోదు చేయడం జరిగింది. ఇవన్నీ స్వచ్ఛందంగా జరిగిన సంఘటనలే, కాని వాటి ప్రభావం మాత్రం చాలా వుంది.

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**

# సంపాదకీయం

2009లో మాజీ రాష్ట్రపతి ఎపిజె. అబ్దుల్ కలాం గారి మార్గదర్శకత్వంలో ఎన్.ఐ.ఎఫ్. సంస్థ స్కూలు విద్యార్థులకై 'ఇగ్నైట్' పేరిట వార్షిక పోటీలను పారంభించింది. పల్లెసృజన ఈ పోటీకి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వద్దకు చేర్చి, వారి సృజనాత్మకతను 'ఆలోచనల' రూపంలో ఎన్.ఐ.ఎఫ్.కు పంపింది. గత ఆరు సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు 'ఇగ్నైట్' గురించి అవగాహన కల్పించి వేలకొద్ది వారి ఆలోచనలను పోటీలకు పంపే ప్రయత్నం చేసింది, ఇంకా చేస్తూనే వుంది. చిన్నశోధయాత్రలో పాఠశాల విద్యార్థులతో చర్చలు, అవగాహనా సంభాషణలు ఒక ముఖ్య భాగంగా పల్లెసృజన పరిగణిస్తోంది.

గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ఒక స్థాయికి తేవడానికి ఆర్థిక, సాంకేతిక సహాయం ఇన్నోవేటర్లకు అవసరం. ఎన్.ఐ.ఎఫ్. నుండి వచ్చే సహాయం అతి స్వల్పం. దీన్ని విస్తరించడానికి ఎక్కువ ఇనోనవేషన్లను అభివృద్ధి చేయడానికి వ్యవస్థలోని, ఉద్యోగపతులు, బ్యాంకులు, కళాశాలలు, ప్రముఖ వ్యక్తులు, దాతలను పల్లెసృజన సంప్రదించడం ప్రారంభించింది. ఈవిధంగా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల గురించి ప్రజలకు, ప్రభుత్వ సంస్థలకు, మిగతా వారికి కొత్తగా అవగాహన కలగడమే కాకుండా, కొన్ని లక్షల రూపాయల సహాయం నేరుగా ఇన్నోవేటర్లకు చేరటం జరిగింది. 'నాబార్డ్' సంస్థ ఇందులో అధిక ంగా ప్రధాన పాత్ర పోషించింది.

ఇన్నోవేషన్లను అభివృద్ధి చేయడం ఒకవంతు, వాటిని అవసరమైన రైతులకు, పల్లె ప్రజలకు అందించడం మరో వంతు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పల్లె జ్ఞానాన్ని విస్తరింప జేయడానికి 2009లో 'క్రియేటివ్ మైండ్స్' అన్న వాణిజ్యపరమైన సంస్థను రిజిష్టర్ చేయడం జరిగింది. వినియోగానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లను ప్రజలకు అందించడమే దీని ముఖ్య ఉద్దేశ్యము. ఈ మార్కెటింగ్ బాధ్యతను ఇప్పటివరకు క్రియేటివ్ మైండ్స్ ద్వారా పల్లెసృజన నిర్వహిస్తున్నది. అవసరార్థం, సందర్భానుసారంగా ఉద్భవించిన క్రియేటివ్ మైండ్స్ పల్లెసృజన ప్రయాణంలో ఒక మైలురాయి.

ప్రజలతో పనిచేసే ఏ సంస్థకైనా తనకంటూ ఒక పత్రిక లేకపోతే సంస్థ ఉద్దేశ్యాలు సాధించడం సాధ్యం కాదు. అందుకే 2006లో 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను ప్రారంభించాము. ఏ బంధాలు, సహాయ సహకారాలు లేకుండా పత్రిక నడపాలంటే దానికి భావ స్వాతంత్ర్యం, సారధ్య స్వాతంత్ర్యం తప్పనిసరి అనేవారు మహాత్మా గాంధీ. 'పల్లెసృజన' పత్రిక ఆయన అడుగు జాడల్లో నడవడానికి ప్రయత్నం చేస్తున్నది. వచ్చే సంచిక 50వ సంచికగా విడుదల కాబోతున్నది. వెనక్కి చూస్తే మన పల్లెల్లో ఇంత జ్ఞానమున్నదా! అని ఆశ్చర్యపోతున్నా. అద్భుతమైన తెలుగు జ్ఞాన సంపదను గ్రంథస్తం చేసే అదృష్టం పల్లెసృజనకు లభించినందుకు మేమెంతో గర్విస్తున్నాం.

2010లో **www.pallesrujana.org** పల్లెసృజన వెబ్‌సైట్‌ను ప్రారంభించాము. అన్ని ఇన్నోవేషన్లు, పల్లెసృజన పత్రికలు, చిన్నశోధయాత్ర విశేషాలు, కార్యక్రమాలు, నూతన ఆలోచనలు ఇవన్నీ ఈ వెబ్‌సైట్‌లో లభిస్తాయి. ఇదికూడా వాలంటీర్ల సహాయంతో నడుపబడుతున్నది.

ఇన్ని జరుగుతున్నా ఇంకా చాలా జరగాల్సి వుంది. ఎంతోమంది ఇన్నోవేటర్లను వెతకాలి, బడిపిల్లను, కళాశాల విద్యార్థులను దీనికై వినియోగించాలి. ఉపాధ్యాయులు వారికి మార్గదర్శకత్వం చేయాలి. సమాజంలో వున్న క్రియాశీలతపై యువతకు అవగాహన తీసుకు రావాలి. ఇన్నోవేషన్‌కు ఆర్థిక సహాయం, మార్కెట్‌లో అవకాశాలు, పేటెంట్లు, వ్యవస్థాపరంగా లభించాలి. పల్లెసృజన పత్రిక తెలుగువారి ప్రతి ఊరికి చేరాలి. గ్రామీణాభివృద్ధి పథకాల్లో పారిశ్రామిక విధానాల్లో, గ్రామీణ సృజనలు, సాంప్రదాయ జ్ఞానాలకు సరియైన ప్రాధాన్యత ఇవ్వాలి. వందలకొద్ది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలి.

వీటిని సాధించాలంటే మీ సలహాలు, సహకారాలు కావాలి. పెద్ద కంపెనీలతో, ప్రభుత్వ సంస్థలతో, విద్యార్థులతో, సమాజ సమూహాలతో ఎలా కనెక్టు కావాలో ,పునాది స్థాయి జ్ఞానాన్ని ఎలా ప్రజలందరికి చేరవేయాలో కూడా మాకు సలహాలు కావాలి. ఆలాంటి సంబంధాలు ప్రజల ఆశలను నెరవేరుస్తాయి. సహకారపూరిత సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతాయి. ఈ పదేళ్ళలో ప్రజల సమస్యలను పరిష్కరించే 'పల్లెసృజన' విధానం కొందరికైనా స్ఫూర్తినిచ్చి వుంటుంది అన్నది మా నమ్మకం.

సమాజంలో దాగివున్న జ్ఞానాన్ని వెలికి తీసే ప్రయత్నంలో దూరంగా వున్న ప్రజా సమూహాల మధ్య (గ్రామం - పట్టణ) దూరాన్ని తగ్గించి, పరస్పర అవగాహన పెంచి, సంస్కృతి నేర్పిన పాఠాల ఆధారంగా సహకారం, సుస్థిరత, సమృద్ధి సమాజంలోని అన్ని రంగాలలో రావాలని ఆశిస్తూ......

ఈ వేసవిలో పశువులను, పక్షులను కాపాడుకుంటూ, రాబోయే మంచి వానాకాలంకై మనమంతా ఆశగా ఎదురు చూద్దాం.

**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**




సృజనాత్మకతకు కులం, మతం, హెూదా, వయస్సులతో సంబంధం లేదని మరోసారి నిరూపించాడు గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల కేంద్రానికి చెందిన ఎం.ఏ. సుభాని, షాకీరా దంపతుల కుమారుడైన 26 సంవత్సరాల 'నూరిన్ షేక్'. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 10వ తరగతికి మించి చదవలేక పోయిన నూరిన్ షేక్ తదనంతరం పాలిటెక్నిక్‌లో 'డిఇసిఇ' (డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) చేశాడు. ఆ తర్వాత ఉద్యోగ వేట ప్రారంభించి రైల్వే లో 'అసిస్టెంట్ డ్రైవర్' గా చేరాడు.

మనం రైలు ప్రయాణం చేస్తున్నపుడు ఎప్పుడైనా 'క్రాసింగ్' పరిస్థితి వస్తే ఆ కొద్దిపాటి నిమిషాలను కూడా ఓపిగ్గా భరించలేక 'ఇంతసేపు ఇక్కడ రైలును నిలబెట్టాలా? ఈపాటికి మరో స్టేషన్ చేరేది కదా?' అని అసహనాన్ని వెలిబుచ్చటం పరిపాటే కదా. మరి ఎప్పుడో ఒకసారి ఆ కాస్త సమయాన్ని కూడా మనం భరించలేకుంటే, రైల్వేలో డ్రైవర్‌గా చేరిన వయసులో చిన్నవాడైన నూరిన్‌కు ఇంకెంత సహనం ఉండాలి? ఒక్కోసారి గంటల తరబడి రైలు ఇంజన్‌లోనే వేచి వుండాల్సిన పరిస్థితి. ఇంజన్‌లో విపరీతమైన శబ్ద కాలుష్యం, వేడి వాతావరణం లాంటివి భరించాలంటే అది ఒక్క రైల్వే డ్రైవర్లకు మాత్రమే సాధ్యమేనేమో అని నూరిన్‌తో మాట్లాడితే అనిపిస్తుంది. 'అందుకే రైల్వే డ్రైవర్లు ఎక్కువ మందికి జుట్టు తెల్ల బడటం, జుట్టు రాలిపోవటం లాంటి సమస్యలకు కారణం కావచ్చు' అంటాడు నూరిన్.

ఉద్యోగంలో చేరిన నాలుగు సంవత్సరాల తర్వాత ఇంతటి తీవ్రమైన సమస్యకు కారణాలను అన్వేషించడం మొదలు పెట్టి, రైలు ఇంజన్‌ను నిశితంగా పరిశీలించి దాదాపు ఒకటిన్నర సంవత్సరం పాటు కష్టపడి మొత్తానికి ఒక నివారణ మార్గాన్ని కనుగొన్నాడు నూరిన్ షేక్. తాను కనుగొన్న పరిష్కారాన్ని తనకు సన్నిహిత సహ ఉద్యోగులతో చర్చించి, పై అధికారులతో కూడా సంభాషించి మొత్తానికి ఒక 'మాదిరి పరికరం' (ప్రోటోటైప్) తయారు చేశాడు.

నూరిన్ తన పరిశీలనలో కనుగొన్న సమస్యలలో ప్రధానమైనవి వేడి వాతావరణం, శబ్ద కాలుష్యం. రైలు ఇంజన్‌లో మొత్తం 14 శక్తివంతమైన మోటార్లు నిరంతరం తిరుగుతునే వుండాలి. మనం ఇంట్లో ఒక మిక్సీ కొద్దిసేపు ఆడితేనే భరించలేమే? మరి అలాంటి మిక్సీకి ఎన్నో రెట్లు పెద్దవైన 14 మోటార్లు ఒకేసారి పని చేస్తే ఎంత వేడిమి, శబ్ద కాలుష్యం వస్తాయో గమనించండి. విపరీతమైన వేడిమి

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**

ఉండటానికి ప్రధాన కారణం ఈ మోటార్లే అని కనుగొన్న తర్వాత 'రైలు ఇంజన్‌లో నిరంతరం ఇన్ని మోటార్లు పనిచేస్తూనే వుండాలా?' అని ఆలోచించాడు. రైల్వే స్టేషన్లలో గంటల తరబడి వేచివున్న రైలు ఇంజన్లు ఎప్పుడూ ఆడుతునే వుండటం అందరూ గమనించే వుంటారు. ఎందుకంటే ఒకసారి ఇంజన్‌ను ఆపిన తర్వాత దాన్ని మళ్లీ రన్నింగ్‌లోకి తీసుకు రావాలంటే ఎంతో సమయం, ఖర్చు పెరుగుతాయి కాబట్టి అలాగే ఇంజన్‌ను రన్నింగ్‌లో పెట్టి వుంచుతారు.

ఇలా స్టేషన్లలో గంటల తరబడి నిలబడిన రైలు ఇంజన్లను కూడా ఎప్పుడూ రన్నింగ్‌లో వుంచడం నూరిన్‌కు మనసు ఒప్పలేదు. పైగా పై అధికారులు తాము ఎప్పుడైనా ఇంజన్‌లో ని బల్బులను ఆర్పి వేయడం మర్చిపోతే వారిని ఎంతగానో దూషించడం విడ్డూరంగా తోచిందతనికి. రైలు ఇంజన్ ఆన్‌లో వుంటే జరిగే నష్టంతో పోలిస్తే ఇది ఏపాటిది? దాన్ని గురించి ఆలోచించకుండా 'లైట్లు' ఆర్పనందుకు తమను దూషిస్తారేమిటన్న ఆలోచనలోంచి పుట్టిందీ 'సృజన'.

నూరిన్ ఆలోచన ప్రకారం రైలు ఇంజన్‌లో ప్రస్తుతం నడుస్తున్న 14 రకాల మోటార్లు నిరంతరం రన్నింగ్‌లో వుండవలసిన అవసరం లేదు. కేవలం రైలు లేదా గూడ్సు బోగీలకు సరఫరా చేసే గాలి వత్తిడి (వాక్యూమ్)ని అందించే రెండు మోటార్లు మాత్రమే నిరంతరంగా ఆడితే, మిగతా 12 మోటార్లను స్టేషన్లలో 5-10 నిమిషాలు ఆపాల్సిన అవసరం వస్తే కూడా ఆపి వేయవచ్చు అన్న సిద్ధాంతంతో రైలు ఇంజన్‌లో ఒక 'స్టెప్‌డౌన్' (విద్యుత్ నియంత్రణ యూనిట్), ఒక స్విచ్‌లను ఏర్పాటు చేస్తే చాలు,





రోజుకి కొన్ని వేల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు అంటాడు నూరిన్. అందుకు తగినట్లుగా ఒక మాదిరి నమూనాను కూడా తయారు చేసి చూపించాడు.

ఇందుకు గాను ప్రతి రైలు ఇంజన్ లోని యంత్రాల నమూనాను మార్చవలసిన పని లేదు, ఇంజన్‌లో ఎటువంటి మార్పులు చేయవలసిన అవసరం లేదు. కేవలం ఒక్కో ఇంజన్‌కు దాదాపు 5–10 లక్షల రూపాయలను వెచ్చించి తాను రూపొందించిన పరికరాలను అమరిస్తే చాలు, దీనికై పెట్టిన ఖర్చును కేవలం 2 సంవత్సరాలలో విద్యుత్ పొదుపు ద్వారా తిరిగి పొందవచ్చు అంటాడు. పైగా నిరంతరం ఆడుతునే వుండే ఇంజన్‌లు అనవసరపు వేళల్లో విశ్రాంతి తీసుకోవటం ద్వారా వాటి జీవిత కాలం పెరగటం వల్ల కూడా ఎందో ఆదా చేసుకోవచ్చు అన్నది నూరిన్ ఆలోచన.

ఒక మామూలు అసిస్టెంట్ డ్రైవర్ రూపొందించిన ఈ పరిజ్ఞానాన్ని రైల్వే అధికారులు ఆమోదించి, రైల్వే ప్రధాన నష్టాలలో ఒకటైన అనవసర ఖర్చులను నియంత్రిస్తారో లేదో వేచి చూద్దాం.

అంతే కాదు రైల్వే ద్వారా రైలు మార్గం వున్న అనేక గ్రామాలకు మంచినీటి సరఫరాను అతి చవకగా సరఫరా చేయటానికి ఒక అద్భుతమైన, సృజనాత్మకమైన ఆలోచన తనవద్ద వుందంటున్నాడు నూరిన్.

ఇక మన ఇన్నోవేటర్ నూరిన్ షేక్ తన ఉద్యోగానికి సంబంధించిన రైల్వే ఖర్చును పొదుపు చేయటంతోనే ఆగలేదు అతని సృజనాత్మకత. సమాజానికి అవసరమైన ఇన్నో ఆలోచనలు అతని మదిలో మెదులుతునే వున్నాయి.

అందులో కొన్ని...... ప్రస్తుతం ఉభయ తెలుగు

**మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.**

రాష్ట్రాల్లో (బహుశా దేశంలోనే) ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అన్న నిబంధనను పకడ్బంధీగా అమలు చేస్తున్న విషయం అందరికి తెలిసిందే. ఈ నిబంధన వల్ల ఎంతోమంది తమ హెల్మెట్లను పోగొట్టుకుని ఇబ్బందుల పాలవుతున్నారని గమనించాడు నూరిన్. ఈ పద్ధతిని పకడ్బందీగా అమలు చేసేందుకు కొత్త వాహనం కొనుగోలు దారులకు వాహనంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ కూడా అందించాలని నిబంధనను కూడా విధించడం అందరికీ తెలిసిందే.

ఈ పరిస్థితులను అధిగమించేందుకు వాహనాల తయారీలోనే ఒక చిన్న మార్పు ద్వారా వాహన దారుడు హెల్మెట్‌ను తన పనిమీద వెళ్ళినప్పుడు దాన్ని తనతో పాటు తీసుకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా వాహనానికే అమర్చేలా ఒక నమూనా తయారు చేశాడు. వాహనం ముందు వైపున వున్న హెడ్‌లైట్‌పైన ప్రతి వాహన తయారీదారులు ఒక డూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దాన్ని కొద్దిగా మార్పు చేసి, హెల్మెట్‌ను కూడా ఆ 'డోమ్'లోనే అమర్చేలా ఏర్పాటు చేయాలని అంటారు నూరిన్. అందువల్ల హెల్మెట్‌ను వాహనానికి అమర్చడానికి ప్రత్యేకమైన తాళం చెవి, మరో పరికరం అమర్చ వలసిన అవసరం లేకుండా ద్విచక్ర వాహనం ఆపిన వెంటనే హెల్మెట్‌ను తీసి డోమ్ వద్ద తాను సూచించిన పద్ధతిలో అమర్చి వాహనం తాళం వేస్తే చాలు హెల్మెట్ కూడా లాక్ అయిపోతుంది అంటాడు. వాహన దారుడు తిరిగి వచ్చిన తర్వాత ఆ హెల్మెట్‌ను తీసి తన తలకు ధరించుకుంటే తప్ప వాహనం కదలకుండా



వుండేలా సృజనాత్మకమైన పద్ధతిని కనుగొన్నాడు నూరిన్. ఈ పద్ధతిని ఇప్పటినుంచి తయారయ్యే వాహనాలకు తయారు చేస్తే మార్కెట్లో మామూలుగా లభించే హెల్మెట్‌లకు బదులు వాహనం కలర్లోనే, వాహనం డిజైన్‌కు అనుబంధంగా హెల్మెట్ వుంటుందని, పైగా నకిలీ హెల్మెట్‌ల బెడద కూడా తగ్గే అవకాశం ఉందని అంటాడు నూరిన్.

ఇవే కాక ఇంకెన్నో సృజనాత్మక ఆలోచనలు నూరిన్ మదిలో మెదులుతునే వున్నాయి. సమాజానికి ఎంతో ఉపయోగ పడే ఎన్నో మంచి ఆలోచనలను నూరిన్ మనకు అందిస్తాడని ఆశిద్దాం. ప్రస్తుతం ఇతని సృజనాత్మకతను 'రైల్వే శాఖ అధికారుల'తో చర్చించి రైల్వే శాఖలో కొన్ని కోట్ల రూపాయల పొదుపుకు నాంది పలికేందుకు 'పల్లెసృజన' కృషి సలుపుతోంది. నూరిన్ తయారు చేసిన 'హెల్మెట్' ఆలోచనను కూడా అనేక ద్విచక్ర వాహన తయారీదారులకు పంపి నూరిన్‌తో సంధానానికి ప్రయత్నిస్తోంది.

●





సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/ గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**


**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**


**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ **http://www.nif.org.in/announcement**.చూడండి.

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.




'పల్లెసృజన' కుటుంబ సమావేశం 30-31 జనవరి, 2016 తేదీలలో హైదరాబాద్ తార్నాక లోని 'సత్యోదయ' ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 35మందికి పైగా ఇన్నోవేటర్లే కాక, పల్లెసృజన వాలంటీర్లు, ప్రభుత్వాధికారులు, శాస్త్రవేత్తలు, శ్రేయోభి లాషులు పలువురు మంది హాజరయ్యారు. పల్లెసృజన సంస్థ ప్రారంభించినప్పటినుంచి, దాదాపు ఈ పది సంవత్సరాలలో ఏమి చేయాలని పల్లెసృజనను ప్రారంభించామో, ఏమి చేశామో, ఏమి చేస్తున్నామో, ఇంకా ఏమి చేయటానికి అవకాశం వుంది అని అందరూ కూర్చుని, ఆలోచించి, చర్చించి, నిర్ణయాలు చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ కుటుంబ సమావేశం నిర్వహించబడింది. రెండు రోజులపాటు జరిగిన ఈ సమావేశంలో ఉత్సవ వాతావరణం, పండగ హడావిడి కన్పించింది. ఇన్ని సంవత్సరాల పాటు పల్లెసృజనతో సంబంధాలు కలిగిన వ్యక్తులందరూ ఒక్కచోట చేరితే పండగే కదా మరి!

రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని నాలుగు భాగాలుగా చేసుకుని, నాలుగు ముఖ్యమైన అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోబడ్డాయి. ఒకటవ భాగంలో 'పల్లెసృజన' పత్రిక, దానిలోని అంశాలను ఇంకా ఆకర్షణీయంగా, ఉపయోగ కరంగా చేయటం, చందా దారులను పెంచే మార్గాలు, పత్రికతో పాటు ఇతర అనుబంధ ప్రచురణలు, పత్రికలో వ్యాసాలు, కథనాలు వ్రాయటంలో అందరి సహకారం చోటు చేసుకున్నాయి. రెండవ భాగంలో 'స్కౌటింగ్ మరియు ప్రచారం'. ఈ అంశం క్రింద ఇంకా ఎక్కువ మంది ఇన్నోవేటర్లను గుర్తించటం, చిన్న శోధయాత్రలను ఇంకా ఫలప్రదంగా వాడుకోవటం, సంచార సమాచార వితరణ పద్ధతులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయటం, పాల్గొనడం గురించి చర్చించడం జరిగింది. మూడవ విభాగంలో క్రియేటివ్ మైండ్స్ ద్వారా ప్రజలకి ఇన్నోవేషన్లు చేరువయ్యే మార్గాలు ప్రతి పల్లెకు వాటిని విస్తరింప జేసే మార్గాలు, వినియోగానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్ల మార్కెటింగ్‌లను గురించి చర్చించటం జరిగింది.

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**

చివరగా 'పల్లెసృజన' సంస్థ ఇంకా విస్తృతంగా సలహాలు, సంప్రదింపులు జరపటానికి, దీని సేవలను ఇంకా విస్తృతం చేయడానికి 'పల్లెసృజన' ఫౌండేషన్ ఏర్పాటు అవకాశాలను గురించి చర్చించటం జరిగింది.

ముందుగా పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రిగేడియర్ గణేశం 'పల్లెసృజన' పుట్టుపూర్వోత్తరాలు, చేస్తున్న కార్యక్రమాలను గురించి 'సింహావలోకనం' చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీయుతులు శ్రీకర్, ఐఐఓఆర్ డైరెక్టర్ వరప్రసాద్, ఇన్నోవేటర్లు కిషన్ పవార్, చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ లు పాల్గొన్నారు. తరువాత 'పల్లెసృజన' పత్రికకు సంబంధించిన చర్చల్లో శ్రీయుతులు శశిమోహన్ పత్రిక పుట్టు పూర్వోత్తరాలను వివరించారు. ఈ గోష్టిలో శ్రీయుతు వీర రాఘవ రెడ్డి, రాంబాబు, క్రాంతికుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. పది మందికీ పనికి వచ్చే పత్రిక చందాదారులను పెంచటంలో, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి పల్లెకు ఈ పత్రిక చేరాలంటే పత్రికతో సంబంధమున్న ప్రతి ఒక్కరు ఈ విషయంలో చేయూతనివ్వాలని, ప్రతి వాలంటీరు వారి దృష్టికి వచ్చిన సమాచారం పల్లెసృజనకి పనికి వస్తుంది అనిపిస్తే దానిని యధాతథంగా గాని, తర్జుమా చేసిగాని 'పల్లెసృజన' కార్యాలయానికి పంపించాలని, త్వరలోనే పల్లెసృజనకి పనికి వచ్చేవిధంగా వ్యాసాలు వ్రాయటానికి, తోడ్పడటానికి వాలంటీర్లకి, ఉత్సాహమున్న వారికి ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని, పల్లెసృజన పత్రిక ప్రతి పాఠశాల, కళాశాల లైబ్రరీలకు చేర్చేందుకు ప్రత్యేక కృషి చేయాలని నిర్ణయించడం




జరిగింది.

తరువాత స్కౌటింగ్, ప్రచారం గురిచి జరిగిన చర్చల్లో వ్యవస్థాపక కార్యదర్శి చంద్రకాంత్ శర్మ, సిఎస్ఐఆర్ విశ్రాంత సైంటిస్ట్ మూర్తి , ఆచార్య చుగ్ గారలు, ఇన్నోవేటర్లు బాబూరావు, మహిపాల్ చారి, నాగరాజులు పాల్గొన్నారు. 'పల్లెసృజన'కి సంబంధించిన ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్ల సమాచారం విస్తృతంగా ప్రచారం చేయటానికి ప్రదర్శనలు, వీడియోల సహాయం తీసుకోవాలని పాఠశాలలు, కళాశాలల తో అనుసంధానం ఏర్పరచు కోవాలని, మీడియా, ఎలక్ట్రానిక్ మాధ్యమాలని, సెల్‌ఫోన్, వాట్సప్‌లని విరివిగా ఉపయోగిం చుకోవటం, ప్రతి ఇన్నోవేటరు ఒక స్కౌటుగా పని చేయాలని, కొత్తవారిని పల్లెసృజనకు పరిచయం చేయాలని, పల్లెసృజన సంస్థకి, పత్రికకి కావలసిన సమాచారం సేకరించి పంపించాలని, ఆకారంలో చిన్నగా వున్న ఇన్నోవేషన్లను మారుమూల ప్రదేశాలకు కూడా తీసుకువెళ్ళి ప్రదర్శించడా నికి లేదా సంచార ప్రదర్శన శాలగా ఉపయోగించటానికి ఒక వాహనాన్ని, దానికయ్యే ఇతర ఖర్చులని సమకూర్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలన్న సూచనలు చేయటం జరిగింది.

క్రియేటివ్ మైండ్స్‌కి సంబంధించిన చర్చలలో శ్రీయుతులు దుర్గాప్రసాద్, శ్రీకర్, సుభాష్, ఇన్నోవేటర్లు శ్రీదేవి, గోదాసు నర్సింహ, పాండురంగం, జె.ఎన్.టి.యు. ప్రొఫెసర్ ఎ.ఆర్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇన్నోవేటర్లు నేరుగా కాక, వారి ఇన్నోవేషన్లు మార్కెటింగ్



మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.

చేయటానికి ప్రత్యేకంగా ఏర్పరచుకొన్న క్రియేటివ్ మైండ్స్ ద్వారానే అమ్మకాలు చేయాలని నిర్ణయించడం జరిగింది. మనవద్ద అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు చాలా ఉన్నాయని, వాటిని ప్రతి ఇన్నోవేటర్ వారి ప్రాంతాలలో తమ ఇన్నోవేషన్లతో పాటు ఇతరుల ఇన్నోవేషన్లను కూడా అమ్మటానికి ప్రయత్నించాలని నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న ప్రతి ఇన్నోవేటర్, శ్రేయోభిలాషి, వాలంటీరు దాదాపు అందరూ చాలా చురుగ్గా చర్చలలో పాల్గొనడం జరిగింది. ప్రతి ఒక్కరూ 'పల్లెసృజన' సంస్థ, పత్రిక తమకు ఏవిధంగా మేలు చేసింది, ఎక్కడో మారుమూలన వున్న తమకు, తమ ప్రతిభకు ఒక ఉనికిని కల్గించి, నలుగురికీ తెలిసేలా చేసిన ఈ సంస్థకు ఎప్పటికీ రుణపడి వుంటామని, దానికి ప్రతిగా ఇప్పుడు రెండవ దశగా ఎవరికి వారుగా వెళ్ళిపోకుండా ఇప్పుడు కలిసి కట్టుగా వుండి, ఒకరికి ఒకరం సహాయం చేసుకుంటూ, ఆలోచనలను పంచుకుంటూ మనతో పాటు ఈ సంస్థను కూడా ముందుకు తీసుకు వెళ్ళి వందల మంది ఇన్నోవేటర్లను ప్రోత్సాహపరచ వలసిన బాధ్యత మనపై వుంది అన్న




అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతి అధికారి, శాస్త్రవేత్తలు, సంస్థల ప్రతినిధులు పల్లెసృజన చేస్తున్న పని ఉత్కృష్టమైనదని, సమాజంలో ఇంకెవరూ చేయని పని మీరు చేస్తున్నారని, మీకు ఏవిధమైన సహాయం కావాలన్నా చేయటానికి తాము సిద్ధంగా వున్నామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఎన్.ఐ.ఎఫ్. ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ ఆచార్య అనిల్ గుప్త గారు అహమ్మదాబాద్ నుండి వీడియో ద్వారా పల్లెసృజన కుటుంబ సభ్యులని



మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.
కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.






సంబోధించారు. గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి నలుగురికీ అందుబాటులోకి తీసుకు రావటానికి చేస్తున్న 'పల్లెసృజన' సేవ శ్లాఘనీయమని, ఇదంతా వాలంటీర్ల కార్యదీక్ష వల్లనే సాధ్యమైందని అభినందిస్తూ చేసింది ఎంత వున్నా, చేయాల్సింది చాలా వుందని, ఇదే దీక్షతో ముందుకు సాగాలని కోరుకుంటు న్నానని సందేశం ఇచ్చారు. పల్లెసృజన కుటుంబం ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌ను తీలుగులోకి అనువాదం చేయాలని, దానివల్ల దేశంలోని పల్లెజ్ఞానం తెలుగు రైతులకు అందుబాటులో ఉంటుందని సలహా ఇచ్చారు.

బ్రిగేడియర్ గణేశం రెండు రోజులు జరిగిన సమావేశ చర్చల సారాంశం గురించి మాట్లాడుతూ..... మన ఇన్నోవేటర్లు స్థానికంగా వున్న ఎటువంటి సమస్యలకైనా, స్థానికంగా లభించే వనరులతోనే పరిష్కార మార్గాలను కనుగొన గలిగే శాస్త్రవేత్తలని, ఈ మాట మనము కాదు, మన



గురించి తెలిసిన ఎవరైనా అనేదే అన్నారు. అందుకే పల్లెసృజన ప్రారంభించిన పది సంవత్సరాలు తిరగక ముందే దాదాపు 12 మంది ఇన్నోవేటర్లకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పురస్కారాలు అందుకో గలిగామని, ఇవే కాక, ఇంకా ఎంతో మంది, ఎన్నో పేరొందిన సంస్థల ద్వారా సత్కరించబడ్డారని, కొందరికి ఆర్థిక సహాయం కూడా అందిందని, ఇదంతా ఇన్నోవేటర్ల, కార్యకర్తల సామూహిక కృషి ఫలితమేనని అన్నారు. ఇంతవరకు చేస్తున్న పని ఇంకా ఉత్సాహంతో, దీక్షతో, పట్టుదలతో మున్ముందు కూడా చేయాలని సూచిస్తూ, మనవాళ్ళకి ఆర్థికంగా సహాయం చేయటానికి సంస్థాపరంగా ఆర్థిక వనరులు అందించే అవకాశాలని మెరుగు పర్చటం కోసం ఒక ట్రస్టు ఏర్పాటు చేసే ఆలోచన వుందని, అదేవిధంగా వాణిజ్యపరంగా విస్తృత స్థాయిలో ఇన్నోవేషన్లు చేయటానికి వీలు కల్పించే ఉద్దేశ్యంతో ఒక కన్సల్టింగ్ కంపెనీ ప్రారంభించే ఆలోచన కూడా వుందని, త్వరలోనే ఇవి రూపు దిద్దుకొని మన కార్యక్రమాలను ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు తీసుకు వెళ్ళే సౌలభ్యం వుంటుందని ఆశిస్తున్నానన్నారు.

రెండురోజుల పాటు జరిగిన ఈ ఉత్సవ కార్యక్రమం మన వాలంటీర్లు అందజేసిన విరాళాల ద్వారా సేకరించిన ఆర్థిక సహాయంతో నిర్వహించడం ఎంతో ఆనందించాల్సిన విషయం. ఈ రెండు రోజుల కార్యక్రమానికి, జరిగిన చర్చలకి సంధానకర్తగా శ్యామ్ ●

(మధ్యపేజీల్లో మరికొన్ని కుటుంబ సమావేశ చిత్రాలు)

కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.

రైతుకు ఎల్లవేళలా ఖర్చు లేకుండా నీటిని అందించే

# పటాన్ సైదా 'గాలిమర పంపు'



ఇన్నోవేటర్ పటాన్ సైదా

ప్రస్తుత జీవన విధానానికి అత్యంత అవశ్యకమైన వాటిలో 'విద్యుత్తు' ఒకటి. ఎన్నో రాష్ట్రాలు, దేశం కూడా ఈ విద్యుత్‌ను సమాజానికి అందించటానికి ఎన్నో పోరాటాలు, ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఇక రైతుల విషయానికి వస్తే.... మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు రైతులకు ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నాయి కానీ, ఆ విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. 'ప్రాణం పోకడ, విద్యుత్ రాకడ ఎవ్వరూ చెప్పలేరు' అని సామెత కూడా ఈమధ్య పుట్టుకొచ్చింది. కానీ ఎల్లవేళలా, కాస్త ఎక్కువైనా, తక్కువైనా విశ్వంలో తప్పకుండా ప్రయాణిస్తున్న ప్రాణ వాయువు 'గాలి' అన్న విషయం అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. ఎప్పుడు వుంటుందో, ఎప్పుడు వుండదో తెలియని, ఖరీదైన విద్యుత్ బదులు, గాలి వాటంతో మాత్రమే నడిచేలా ఒక పంపుసెట్ తయారు చేస్తే రైతుకు అంతకన్నా కావాల్సిందేముంది?

విద్యుత్ మోటారు కొనుగోలు, దానికి విద్యుత్ కనెక్షన్ కొరకు ఆ శాఖ చుట్టూ తిరగటం లాంటి ఇబ్బందులు రైతులకు విదితమే. విద్యుత్‌ను ఆదా చెయ్యటమంటే విద్యుత్‌ను తయారు చెయ్యటమే అన్న విషయం కూడా అందరికీ తెలుసు. మరి గాలిమర సహాయంతో పంపుసెట్‌లను నడపగలిగితే ఎన్ని కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేస్తామో ఒకసారి ఆలోచించండి. ఈ గాలిమర పంపుసెట్‌ను ఒక్కసారి ఖర్చు చేసి ఏర్పాటు చేసుకుంటే చాలు ఇక ఎలాంటి ఖర్చులూ వుండవు. ఎప్పుడో ఒకసారి తిరిగే భాగాలను గ్రీసు అంటించటం మినహా ఎటువంటి ఖర్చూ లేదు. చిన్నపాటి గాలి ఎటువైపు నుంచి వచ్చినా సరే పటాన్ సైదా తయారు చేసిన గాలిమర ఒకేవైపుకు తిరుగుతూ ఆ పంపుసెట్‌ను నడిపించటం ద్వారా నీటిని తోడుతుంది.

ఇక ప్రస్తుత విషయానికి వస్తే మన ఇన్నోవేటర్ గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన పటాన్ సైదా పాఠకులకు గుర్తుండే వుంటుంది. ఎంతో అద్భుతమైన గాలిమరను తయారు చేసిన పటాన్ సైదా అతి తక్కువ గాలికి కూడా తిరగ గలిగేలా దాన్ని అభివృద్ధి చేశాడు. ఆ గాలిమరను రైతులకు అనుసంధానం చేయటానికి 'గాలిమర పంపుసెట్'లను తయారు చేశాడు.

నెల్లూరు జిల్లా, అల్లూరు మండలం లోని వెస్ట్ గోగులపల్లె గ్రామానికి ఇటీవల 'పల్లెసృజన' బృందం 'శోధయాత్ర'కు వెళ్ళగా అక్కడి రైతుల్లో ఒకరైన లక్ష్మయ్యతో చర్చలు జరిపారు. సముద్ర జలాల నుండి ఉప్పు తయారు చేసే విధానం పూర్తిగా పూర్తిగా లక్ష్మయ్య శోధయాత్రికులకు వివరించారు. అయితే నీటిన్ని ఉప్పు పొలాల్లోకి విద్యుత్ ద్వారా సరఫరా చేస్తున్నాడు. దీనికి ఖర్చు ఎక్కువగా అవుతుంది. చాలామంది ఉప్పు రైతులు అనుమతి లేని విద్యుత్ కనెక్షన్లతో నడుపుతున్నారు. శోధయాత్రికులు లక్ష్మయ్యతో చర్చించి గాలిమర అమరిస్తే తన ఉప్పు పొలాలకు నీరు సరఫరా చేయవచ్చని నిర్ణయించారు. గ్రామీణ శాస్త్రవేత్త పటాన్ సైదా వాలంటీర్ల ఆర్థిక సహకారంతో లక్ష్మయ్యకు తోడుగా ఒక గాలిమర పంపును

దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.

గోగులపల్లిలో అమర్చాడు. అయితే రైతు లక్ష్మయ్య ఉప్పు పొలానికి కాకుండా తన చేపల చెరువుకు బిగించాడు. 30 అడుగుల లోతుగల బోరుబావి నుండి 3 అంగుళాల పైపులో ఈ గాలిమర నీటిని తోడి పోస్తోంది.

గతంలో పటాన్ సైదా ఏర్పాటు చేసిన గాలిమర పంపులకు దీనికి చాలా వ్యత్యాసమున్నది. గతంలో మార్కెట్‌లో లభించే 4 పంపుసెట్‌లను ఒక గాలిమరకు అమర్చటం ద్వారా నిరంతరాయంగా నీరు వచ్చేది. మార్కెట్‌లో కొన్న ఈ పంపుసెట్ల వలన కొంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పటాన్ సైదా ఈసారి తానే ఒక పంపుసెట్‌కు రూపకల్పన చేసి నాలుగు పంపుసెట్‌లకు బదులు ఒకే పంపుసెట్‌ను ఈ గాలిమరకు ఏర్పాటు చేయటమైనది. ఒకే పంపుసెట్‌ను ఏర్పాటు చేయటం వలన బోరు బావినుండి నీటిని తోడుతున్నది కాని, చేతితో కొట్టే బోరు బావి నీటిలా ఆగి ఆగి (చేత్తో బోరును కిందకు వత్తిడి చేసినప్పుడు మాత్రమే నీరు వస్తున్నట్లు) వస్తున్నది. దీనికే రెండు పంపుసెట్లను ఏర్పాటు చేసినట్లయితే నిరంతరాయంగా రెండున్నర అంగుళాల పైపులో నీరు వస్తుంది. మార్కెట్‌లో లభించే పంపుకన్నా ఇది అత్యంత శక్తివంతంగా పని చేస్తుండటంతో నీటిని కూడా ఎక్కువగా తోడుతున్నది.

భూమట్టం నుండి 7 అడుగుల ఎత్తు వరకు పిల్లర్‌ను ఏర్పాటు చేసి దానిపై రెండున్నర అడుగుల ఎత్తుగల గాలిమరను బిగించాడు పటాన్ సైదా. దీనికి తానే స్వయంగా రూపొందించిన పంపుసెట్‌ను ఏర్పాటు చేయటంతో ప్రస్తుతం ఇది నిమిషానికి 30 నుండి 35 లీటర్ల వరకు నీటిని తోడుతోంది. గాలి వేగం ఇంకా పెరిగితే 50 నుండి 60 లీటర్ల వరకు కూడా నీటిని తోడుతుంది అంటున్నాడు పటాన్ సైదా. గతంలో మార్కెట్‌లో లభించే పంపుసెట్లను బిగించిన వాటిలో నిమిషానికి 15-20 లీటర్ల నీటిని మాత్రమే తోడుతున్నవి. తాను తయారు చేసిన పంపుసెట్ వల్ల రెట్టింపు నీటిని తోడుతోందని అంటున్నాడు. ఈ గాలిమర మొత్తం ఎత్తు 10 అడుగుల లోపే వుంది. దీన్ని ఇంకా కొద్దిగా ఎత్తు పెంచి రెండు పంపుసెట్‌లను ఏర్పాటు చేసినట్లయితే మూడు అంగుళాల పైపు ద్వారా కూడా నిరంతరాయంగా నీటిని తోడవచ్చు.

ఇక్కడ ముఖ్యంగా రైతులు గమనించాల్సింది ఏమిటంటే ఒకేఒక్కసారి ఖర్చు చేసి ఈ గాలిమర పంపు ఏర్పాటు చేసుకున్నట్లయితే ఎల్లప్పుడూ తమ పొలాలకు నీరు



పారించుకోవచ్చు. కరెంటు, డీజిలు, మానవ శక్తి లాంటి ఖర్చులు లేవు. నీటితో అవసరం లేదు అనుకున్నప్పుడు దాన్ని ఆపితే తప్ప అది తిరుగుతునే వుంటుంది, నీటిని తోడుతునే వుంటుంది. ఈ గాలిమర పంపును ముఖ్యంగా చిన్న చిన్న కమతాలు వున్నవారు, నది, చెరువు, కుంటల ప్రక్కన పొలాలు వున్నవారు, తక్కువ లోతులో బోరు బావుల్లో నీరు లభ్యమయ్యే ప్రదేశాల వారు దీన్ని ఏర్పాటు చేసుకుంటే ఎటువంటి నిర్వహణా వ్యయం లేకుండా నీటిని తోడుకోవచ్చు. దీన్ని ఏర్పాటు చేసుకున్న రైతు భవిష్యత్తులో నీరు పారించేందుకు ఎటువంటి ఖర్చులూ పెట్టవలసిన అవసరం లేదు. కొద్దిపాటి తర్ఫీదుతో తన పంపును తానే రిపేరు చేసుకోగలడు. ఎందుకంటే ఇందులో రిపేరికి వచ్చే వస్తువులు కూడా దాదాపు వుండవు.

రైతులు గమనించాల్సిన మరో ప్రధాన విషయం ఏమిటంటే ఈ గాలిమర గురించి తెలుసుకోవాలి. గాలి, నీరు రెండూ ప్రకృతి వరాలు. వీటిపై మనకు పూర్తిగా నియంత్రణ ఉండదు. ఈ సందర్భంలో ఈ క్రింద కొన్ని నిజాలను రైతులు గమనించగలరు.

❀ గాలిమర నీటిపంపు గాలి వేగం, నీరు లభించే లోతుపై ఆధారపడి వుంటుంది.

❀ 30 అడుగుల లోతునుండి నీటిని తోడవచ్చు. ఇంతవరకు పటాన్‌సైదా ప్రయోగాలన్నీ విజయవంతం అయ్యాయి.

❀ కావలసిన ప్రతి రైతు ఇన్నోవేటరును సంప్రదించి తమ అవసరాల సాధ్యాసాధ్యాలను గురించి తెలుసుకుని నిర్ణయించుకోవాలి.

**(మిగతా 24వ పేజీలో)**

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**

# ఒక భారతీయ సగటు రైతు కథ

**ధారావాహికం 4వ భాగం**

- **చల్లా కృష్ణారెడ్డి**, గుంటూరు జిల్లా.

గురజాల పట్టణం నుండి ప్రైవేటు బస్సులను నడిపించు ఓనరు ఒకతను నాపై కన్నువేసినాడు. కృష్ణారెడ్డి లాగా ఎక్కువమంది ఆటోలను కొనుక్కొని తిప్పగలిగితే మా బస్సులకు కలెక్షన్ ఆగిపోయి మాకు బాగా నష్టం వచ్చే అవకాశముందని బ్రేక్ ఇన్‌స్పెక్టర్లను పిలిపించుకొని తాను దగ్గరుండి ఆటోలపై కేసులు వ్రాయించడం మొదలు పెట్టాడు. ఆటో కొని తిప్పేవాళ్ళను బాగా ఇబ్బందికి గురి చెయ్యడం మొదలు పెట్టాడు. ఆ క్రమంలో ఆటోవాళ్ళంతా కలిసి యూనియన్ ఏర్పాటు చేసుకొని బస్సుల వాళ్ళపై తిరుగుబాటు ప్రకటించాము. ప్రైవేటు బస్సులు పర్మిట్లు లేకుండా తిరుగుతున్నా, ఎక్కువ మంది ప్యాసింజర్లను ఎక్కించుకుని తిప్పుతున్నా, వాళ్ళని కట్టడి చెయ్యడం లేదు. మా ఆటో వాళ్ళనెందుకు టార్గెట్ చేస్తున్నారు అని మేము గోల పెట్టి బ్రేక్ ఇన్‌స్పెక్టర్లను అల్లరి పెట్టడం కూడా జరిగింది. కొంతవరకు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు మావైపు మొగ్గటం చూసి, బస్సు ఓనర్లు ఇంకా పైవాళ్ళతో ఆటోవాళ్ళను కట్టడి చెయ్యటానికి ప్రయత్నాలు కొనసాగించారు.

అప్పట్లో రాష్ట్రం తెలుగుదేశం పాలనలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఆటోలపై స్పెషల్ డ్రైవ్ పేరుతో ఆటోలపై పెద్ద పెద్ద కేసులు, 20 నుండి 30 వేల రూపాయల జరిమానాలు విధించి వేధించడం జరిగింది. చాలావరకు ఆటోలు అమ్ముకొని ఆటోవాలాలు ఎక్కువమంది రోడ్డున పడి నిరుద్యోగులుగా మారవలసిన దుస్థితి ఏర్పడింది. ఆ క్రమంలో నా ఆటోలకి కూడా కనీసం లక్ష రూపాయల దాకా కేసులు వ్రాయడం జరిగింది. ఫైనాన్స్ వాళ్ళకి డబ్బు కట్టలేక కేసులకి కూడా డబ్బు చెల్లించవలసి వచ్చినందువల్ల ఆటోలను అమ్మి ఫైనాన్స్ తీర్చివేశాను. అప్పుడు 'సుంకు డీజిల్ ఆటో'లు మాత్రమే ఉండేవి. అప్పుడే కొత్త గా 'అప్పీ' ఆటో విడుదలయింది. పాత మూడు ఆటోలను అమ్మివేసి కొత్తగా అప్పీ ఆటో ఒక్కటి కొనుక్కున్నాను. దానిని జాగ్రత్తగా తోలుకుంటూ కిరాణా షాపు ఒకటి అంబాపురంలో ఏర్పాటు చేసుకున్నాను. దానిపై కొంత డబ్బు సంపాదించ గలుగుతున్నాను. ఆ క్రమంలో మరొక కుమారుడు కలగడం, వాడి విద్యాభ్యాసం కూడా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివించి చదువు ఆపివేయడం, పిల్లలిద్దరినీ కిరాణా షాపులో ఉంచుతూ నేను ఆటో తోలుకుంటూ కొంత డబ్బు సంపాదించాను. అవసరమైనప్పుడు పెద్దవాడిని ఆటో నడపటానికి పంపించేవాడ్ని.



ఈ క్రమంలో పెద్దవాడికి మా బంధువుల పిల్లని (మా నాన్న తరుపున బంధువులు) మాట్లాడి పెండ్లి చేయడం, తర్వాత ఊరు చివర్లో తక్కువ రేటుకు వస్తున్న ఒక స్థలాన్ని కొని అందులో స్వంత ఇల్లు కట్టుకొని బజార్లో వున్న కిరాణా షాపుతో పాటు ఇంట్లో కూడా కిరాణా షాపు పెట్టి కోడలుకి పని కల్పించాను. నా భార్య, కోడలు ఇంటి దగ్గరున్న కిరాణా షాపు నడుపుతూ కొంత డబ్బు సంపాదించడం జరుగుతూ వచ్చింది. ఎలాగయితేనేం కొంత డబ్బు వెనకేసుకోగలిగాను. ఆ డబ్బును మాచెర్లలోని చిట్‌ఫండ్ లలో పొదుపు చేయడం మొదలు పెట్టాను.

సొంతంగా కట్టుకున్న ఇల్లు ఊరు చివర ఉండటం వల్ల కిరాణా గిరాకి లేక ఊరకే ఉండవలసి వస్తున్నది ఆడవారికి మరేదయినా పని ఉంటే బావుంటుందని ఆలోచించి పిండిమర, రుబ్బుడు గ్రైండరు తెచ్చి బిగించాను. దాంతో కొంత డబ్బు సంపాదించ గలుగుతున్నాను. ఇంట్లో

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది.**
**ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్మలను గొప్పవాళ్ళను చేస్తుంది.**

వాళ్ళకి పని చేతినిండా దొరుకుతోంది. కాకపోతే కరెంటు బిల్లు ఎక్కువగా వస్తున్నది. దీన్ని గురించి ఆలోచించాలి. కరెంటు సొంతంగా తయారు చేసే విధానం ఏదయినా ఉన్నదా అని ఆ దిశగా ఆలోచన మొదలైంది.

అయితే ఇక్కడ కరెంటు విషయంలో కొంత మంది బడా పారిశ్రామికవేత్తలు కరెంటు బిల్లులు కట్టకుండా పరిశ్రమలు నడిపిస్తూ చివరికి బోర్డులు తిప్పి కరెంటు బిల్లులు కట్టకుండా ఎగ్గొట్టడం ఈ విషయాలు మీడియా ద్వారా తెలుసుకుంటూ ఉండటం ఆ దిశగా నేను ప్రయాణం చేస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన వచ్చింది. ఏదైతేనేమి నాకు మంచి తలంపులు ఉన్నవి, మంచి చేతిలో అధికంగా డబ్బు వస్తే సమాజానికి మంచి జరుగుతుంది. నేను 'దొంగ కరెంటు వాడుకున్నందువల్ల ప్రభుత్వం వారికి నష్టం'. ప్రత్యక్షంగా నావల్ల ఎవ్వరికీ బాధ కలగడం లేదు. ఇంకా కొంత పేదవారికి ఉచితంగా పిండి పట్టించటానికి వీలుగా వుంటుంది అనే ఆలోచనతో కరెంటు హెల్పరుకి లంచం అలవాటు చేసి కొంత దొంగ కరెంటు వాడుకోవటానికి ప్రయత్నం చేశాను. డబ్బు బాగానే మిగులుబాటు అవుతున్నది. వెన్నుపూస దెబ్బ తినటంతో దాంపత్య జీవితానికి కొంత దూరంగా ఉండాలని డాక్టర్ల ద్వారా కొన్ని సినిమాల ద్వారా తెలుసుకున్నాను. కాని మరి నేను ఏవిధమైన కట్టుబాటు చెయ్యలేదు. భార్యతో సంతృప్తిగా కాపురం చెయ్యగలుగుతున్నాను. నాకేమీ కావడం లేదు. దెబ్బ తగిలిన తర్వాతనే నేను ఎక్కువ కాలం అధికంగా దాంపత్య జీవితం పంచుకోవటం జరిగింది.

నా వెలితిని పూరించుకోవటం కోసం ఏ పని చేసినా అది ధర్మమే అవుతుంది అని సిద్ధ సమాధి యోగా క్లాసులకు వెళ్ళినపుడు వారు నేర్పారు. అది నాకు బాగా నచ్చింది. దాన్ని తప్పకుండా ఆచరణలో పెట్టాను. నా కారణంగా ఏ జీవి బాధ పడకూడదు. సాధ్యమైనంత వరకు అది పాటించాను. భగవంతునిపై పూర్తి నమ్మకం ఏర్పడినది. ఎక్కువ కష్టములు ఎన్ని అనుభవిస్తే అంత దేవునికి దగ్గరవుతున్నట్లే అన్న సూత్రమును విశ్వసించాను. ఎందుకంటే కష్టాలు అనుభవిస్తుంటే పాపాలు తగ్గిపోతూ వుంటాయి. అప్పుడు సత్యానికి దగ్గరవుతున్నట్లే కదా. అలా కొంతకాలం బాగానే కష్టపడుతూ డబ్బు సంపాదించగలిగాను.

ఆ క్రమంలో పిండిమర దగ్గర ఒకరోజు పిండి వేస్తూ అయిపోయిన తర్వాత పిండిని దులుపుతూ మర ఆపకుండానే పొరపాటున పిండిమరలో వేలు పెట్టి పిండిని దులపబోయి ఒక చూపుడు వేలు గోరు వరకు విరిగి పోయింది. కుడిచేయి చూపుడు వేలు. అబ్బో దీనితో ఎన్నో వ్రాయాలి అనుకున్నాను. ఈ చర్య వల్ల వ్రాయటానికి వీలు పడదేమో అని ఆసుపత్రికి వెళ్ళి ఆ వ్రేలు కట్ అయిన వేలుని అతికించమని అన్నాను. చెప్పలేము అది అతుక్కోవటం కష్టం అని చెప్పారు డాక్టర్లు. కట్టు కట్టి కొద్దిరోజులు విశ్రాంతిగా వుంటే తగ్గిపోతుంది అని చెప్పటంతో ఇక ఏపనీ చేయటానికి వీలు లేక ఖాళీగా వుండవలసి వచ్చింది. దేనివల్లనో గాని నేను అన్ని పనుల్లో కొంతవరకు ప్రావీణ్యత సంపాదించ గలిగాను. పొలంపని, అరక దున్నటం, బేల్దారు పని, ఇళ్ళలో కరెంటు వైరింగు, ఇళ్ళలో వాటర్ పైపులైన్ బిగించడం, టైలరింగు, వ్యాపారంతో పాటు సంపాదించడం, కవిగా కొన్ని కవితలు, పుస్తకాలు వ్రాయటం ఇలా అన్ని రంగాలలో కొంత ప్రావీణ్యం సంపాదించ గలిగాను. ఇది దేవుడు నాకిచ్చిన గొప్ప వరం.

ఈ క్రమంలో ఊరికే ఉండటం కంటే ఏదైనా చేతితో చేయకుండా ఉండే పని ఏదైనా చెయ్యాలి అనే ఆలోచన వచ్చింది. సోమరితనం నాకు అస్సలు గిట్టదు. మా ఇంటి పక్కన దిగుడు బావిని పూడ్చి ఆ స్థలంలో ఓ శివాలయాన్ని నిర్మించారు. అది పాతబడి శిథిలావస్థకు చేరుకున్నది. దాన్ని పునరుద్ధరించి, అందులో ఓ కళ్యాణ మండపం కడితే బాగుంటుంది అనే ఆలోచన వచ్చింది. నావద్ద కొంత డబ్బు ఉసులుబాటు ఉన్నది. ఊళ్ళో చందా అడిగి కొందరు పెద్దలను కూడగట్టుకుని ఆ పనిలో నిమగ్నమయ్యాను. ఇంటి పనులన్నీ పిల్లలు చూసుకుంటున్నారు. బజార్లో షాపు, ఇంట్లో షాపు, ఆటో నడపటం అన్నీ పిల్లలు చూసుకుంటున్నారు. నేను కేవలం ఊళ్ళోని పెద్దవాళ్ళ అనుమతితో చందాలు ప్రోగు చేసే గుడి కార్యక్రమంలో నిమగ్నమయ్యాను. అలా ఒక నెల గడిచింది. అయినా వేలు బాగవ్వలేదు. **(సశేషం)**

●

ఈ ధారావాహికలో వెలిబుచ్చిన అభిప్రాయాలు రచయితకు సంబంధించినవి. 'పల్లెసృజన'నకు ఎటువంటి బాధ్యత లేదు.
**– ఎడిటర్**

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

కుటుంబం

# 'పల్లెసృజన కుటుంబ సమావేశము' 30-31 జనవరి, 2016









డబ్బు లేదు.. వ్యవస్థ లేదు ...
అధికారులు లేరు .... ఆదేశాలు లేవు .....
అత్యాశలు లేవు ..... నిస్పృహలు లేవు .....
ఓటములు లేవు ......

**ఎంత చిన్నవైనా కేవలం విజయాలు మాత్రమే**

అయినా పల్లెసృజన పని చేస్తూనే వుంటుంది.

ఎందుకంటే.....

● తక్కువ ఖర్చుతో జీవనోపాధి మార్గాలు ● సులభమైన ఇన్నోవేషన్లతో పని తేలికవుతుంది ● సబబైన పద్ధతుల వలన స్థిరత్వం లభిస్తుంది ● పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి ● స్థానికంగా ఉద్యోగావకాశం ● తక్కువ ఖర్చుతో ఎక్కువ అభివృద్ధి ● అందరూ పాలుపంచుకున్నామన్న తృప్తి ● జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణం.









**కొన్ని కొన్ని చిన్న విజయాలు / సాధించిన గమ్యాలు**

◆12 మంది తెలుగు ఇన్నోవేటర్లకు రాష్ట్రపతి పురస్కారం. ◆14 మంది ఇన్నోవేటర్లకు పేటెంటు హక్కులు కల్పించటం ◆28 ఇన్నోవేషన్‌లు మార్కెట్లోకి తేవటం ◆ 17 చిన్నశోధయాత్రల్లో దాదాపు 800 కి.మీ. నడిచి, 600 గ్రామాల సందర్శించటం ◆ 9 సంవత్సరాలుగా 'పల్లెసృజన' పత్రికను నిరంతరాయంగా అందించటం ◆ 15,000 మంది విద్యార్థులకు గ్రామాలతో సంధానం చేయటం ◆ వేలాది మంది రైతులతో వారి గ్రామాల్లోనే ముఖాముఖి ◆ఇన్నోవేషన్లు వాడి వేలాది మంది రైతులు లాభం పొందటం ◆ దాదాపు 200 మంది గ్రామీణ యువతకు ఇన్నోవేషన్ల తయారీ ద్వారా ఉపాధి కల్పించటం.



- పునాది స్థాయి ఇన్నోవేటర్ల శ్రేయస్సే పల్లెసృజన ధ్యేయం.
- సమాజంలోని స్వచ్ఛంద పౌరులే పల్లెసృజన కార్యకర్తలు.
- ప్రజల మంచితనమే పల్లెసృజన ప్రధాన శక్తి.
- సమాజంలో సమానత్వం - సుస్థిరత్వం సాధించటమే పల్లెసృజన కల.
- సామాన్యుల సృజనాత్మకతను విశ్వసించటమే పల్లెసృజన పద్ధతి.
- 'సంవేదిన' పల్లెసృజన తత్వం.





# 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
# బహుమతి పొందిన ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్ల వివరాలు




4వ భాగం

అనువాదం : జె. శశిమోహన్

**జాతీయ మూడవ బహుమతి (మానవ ఆరోగ్యం) :**

**మధుమేహానికి మూలికల మందు :**

**ఠాకూర్ మక్వానా పంచ్ భాయ్ వీరాభాయ్, పాటన్, గుజరాత్ :**



మధుమేహం ముఖ్యమైన లక్షణం రక్తంలో పంచదార శాతం అధికంగా వుండటం. 80 సంవత్సరాల మక్వానా పంచ్ భాయ్ వీరాభాయ్ మధుమేహ బాధితులకు చికిత్స చేయడానికి ఒక మూలికా వైద్యాన్ని వాడుతూ వుంటాడు.

పంచ్ భాయ్ గుజరాత్‌లోని బనాస్కాంతా జిల్లాలోని ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. ఇతను 15 సంవత్సరాల వయస్సులోనే పాటన్ జిల్లాకి వలస వచ్చేశాడు. స్వయంగా కష్టపడి వ్యవసాయం చేస్తూ మొత్తానికి పది బీగాల పొలం సంపాదించుకోగలిగాడు. ప్రస్తుతం కొడుకుల తో కలిసి వ్యవసాయం చేస్తూ వుంటాడు. ఈమధ్యనే వ్యవసాయ పనులను కొడుకులకు అప్పగించి, తాను మాత్రం మూలికా వైద్యంపైన దృష్టి సారించాడు. అతనికి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా మనవలు మూలికల సేకరణలో ఔషధాలు తయారు చేయడంలో సహాయ పడుతూ వున్నారు.

దాదాపు 20 సంవత్సరాల క్రితం తనవద్దకు ఒక స్నేహితుడు వచ్చి, తనకి అధిక దాహము, నీరసము,

కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.

ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయాల్సి వస్తోందని చెప్పాడు. పంచ్ భాయ్‌కి ఔషధ మూలికల జ్ఞానం ఉండటం వలన కొన్ని మూలికలతో ఒక మిశ్రమం తయారు చేసి ఆయనకిచ్చాడు. మొదట్లో ఆ మందు అంతగా పని చేయలేదు. కొద్దిగా మార్పులు చేర్పులు చేసి మరోసారి మందు ఇవ్వగా పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ వార్త ఆనోట ఈనోట విని అవే లక్షణాలున్న అనేకమంది ఇతనివద్దకు రావటం మొదలు పెట్టారు. గత చాలా సంవత్సరాలుగా కొన్ని వందల మందికి ఈ మందు ఉచితంగా ఇస్తూ, సమాజంపట్ల ఇది నా బాధ్యత అంటాడు పంచ్ భాయ్. తాను జీవించివున్నంత కాలం ఈయన భార్య ఈ పనిలో ఇతనికి చేదోడు వాదోడుగా వుండేది. ఈమధ్యనే ఆమె కాలం చేయటంతో ఇప్పుడు ఇతర కుటుంబ సభ్యులు సహాయం అందిస్తున్నారు. తన ఈ ఔషధాన్ని ఆధునిక శాస్త్ర పద్ధతులలో ధృవీకరించి, ఇంకా చాలా మంది మధుమేహ వ్యాధి గ్రస్తులకి ఉచితంగా వైద్యం చేయాలన్నది ఈయన ఆశయం.

మధుమేహ వ్యాధిలో శరీరంలో తగ్గ ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవటం, లేదా శరీర కణాలపై ఉత్పత్తి అయిన ఇన్సులిన్ అంతగా ప్రభావం చూపక పోవటం వలన రక్తంలో చక్కెర శాతం పెరుగుతుంది. దీనివలన మనిషి నీరసించి పోయి, చాలా సందర్భాల్లో దీని ప్రభావం ఇతర అవయవాల మీద కూడా పడుతుంది. పంచ్ భాయ్ స్థానికంగా ఒక మూలిక (పేటెంట్ కారణాల వల్ల పేరు తెలపటం లేదు)ను మంచినీటితో కలిపి రోజుకు రెండుసార్లు వ్యాధిగ్రస్తులు సేవించాలి. సాధారణంగా త్వరలోనే గుణం కనిపిస్తుంది. వ్యాధి ముదిరిపోయిన సందర్భాలలో కూడా ఒకటి రెండు నెలల్లో గుణం కనిపిస్తుంది అంటాడితను.

ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదాబాద్ లోని శ్రీ బి.వి. పటేల్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ & రీసర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ వారు ఈ మందుని పశువులపై పరీశీలింపజేయగా, వాటి రక్తంలో పంచదార శాతం నియంత్రణలోకి వచ్చినట్టు రుజువైంది. ఈ మందును ఉపయోగించటం వలన ఎటువంటి ఇతర సమస్యలూ ఉత్పన్నం కాలేదు. ఇది క్షేమమైనదే అని నిర్ధారించటం జరిగింది. దీనిపై ఇంకా విస్తృతంగా పరిశోధనలు కొనసాగించాలని నిర్ణయించారు.

**జాతీయ మూడవ బహుమతి (పశు వైద్యం) :**

**పశువులలో పొదుగువాపు వ్యాధికి మూలికల మందు :**

**బేచార్ భాయ్ సామంత్ భాయ్ దేవ్‌గన్యా, అమరేలి, గుజరాత్ :**



62 సంవత్సరాల బేచార్ భాయ్ గుజరాత్ లోని అమరేలి జిల్లాలోని హదిద గ్రామంలో ఒక రైతు. వ్యవసాయంతో పాటు ఈయన మూలికా వైద్యం కూడా చేస్తూ వుంటాడు. ఈ క్రమం లోనే పశువులకు సాధారణంగా సోకే 'పొదుగువాపు' వ్యాధిని నయం చేసే మూలికా వైద్య పద్ధతిని కనుగొన్నాడు.

నాలుగవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న బేచార్ భాయ్ అంతటితో చదువు ఆపేసి తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తూ వుండిపోయాడు. ప్రస్తుతం ఈయనకి 9 ఎకరాల పొలం, కొన్ని పశువులు వున్నాయి. ఇతని తొమ్మిది మంది పిల్లలకి పెళ్ళిళ్ళు అయిపోయాయి. స్వతహాగా మృదుభాషి అయిన బేచార్ భాయ్ దయాగుణం కలవాడు. పశువులు అంటే ఆయనకి ప్రాణం. వాటితోటే ఎక్కువ సమయం గడుపుతూ వుంటాడు. అవి మనలా మాట్లాడలేవు కనుక వాటి బాగోగులు మనమే చూసుకోవాలి అంటాడు. పశువులకు వచ్చే వ్యాధులని నయం చేయటానికి తనకు తెలిసిన మూలికలతో అనేక ప్రయోగాలు చేస్తూ వుంటాడు.

చాలా సంవత్సరాల క్రితం ఒకసారి బేచార్ భాయ్ తన గోవులలో ఒకటి చురుకుగా లేకపోవటం గమనించాడు. పాలు పిండేటపుడు పొదుగులు వాచి వుండటం, పాల బదులు పలుచటి రసిక రావటం గమనించాడు. ఇతర గ్రామస్తులతో చర్చించిన తర్వాత ఇది పశువులలో సాధారణంగా వచ్చే వ్యాధే కాని, దీనికి ఎవరివద్దా పరిష్కారం లేదు అని తేలింది. ఇలా కాదని తానే

**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

ఏదైనా చేయాలి అని నిర్ణయించుకున్నాడు. పరిస్థితిని గమనించడం ప్రారంభించాడు. ముందు గమనించింది పశువులని ఆరోగ్యకరమైన పరిసరాలలో ఉంచక పోవటం అని తెలుసుకుని ఆ పరిస్థితిని మార్చాడు. తర్వాత తనకు తెలిసిన మూలికలతో పరిశోధనలు చేస్తూ ఒక లేపనము తయారు చేశాడు. కొంత గుణం కన్పించింది. దాన్నే మారుస్తూ వ్యాధి త్వరగా నయమయ్యే పద్ధతిని కనుగొన్నాడు. తనపశువులకే కాకుండా గ్రామంలో అవసరమైన వారికి కూడా ఈ మూలికా వైద్యాన్ని అందిస్తూ వుంటాడు.

ఈ సంఘటనని వివరిస్తూ బేచార్ భాయ్ తాను మూలికలతో ప్రయోగాలు చేస్తున్నప్పుడు గ్రామస్తులంతా తనని ఎగతాళి చేసేవారని, కాని తన కుటుంబ సభ్యులు, ప్రత్యేకించి మిత్రుడు 'మాంజీభాయ్' నువ్వు ఇది చేయటం వలన నీకే కాదు, గ్రామస్తులందరికీ మేలు జరుగుతుందని తనని ప్రోత్సహించాడని చెప్పాడు. తాను ఇప్పటికి పశువులకి సంబంధించిన వివిధ వ్యాధుల నివారణకి ఔషధాలతో ప్రయోగాలు చేస్తూనే వున్నాను అన్నాడు.

పొదుగువాపు వ్యాధి వచ్చిన పశువులకు సరైన సమయంలో చికిత్స చేయకపోతే అది ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. బేచార్ భాయ్ స్థానికంగా దొరికే ఒక మూలికతో పాటు, నల్లమట్టిని నీటిలో కలిపి కొద్దిగా ఉప్పును చేర్చి వ్యాధి వచ్చిన పశువు పొదుగుకి రోజుకి రెండుసార్లు లేపనంగా వాడుతాడు. కొద్ది రోజుల్లోనే గుణం కన్పిస్తుంది. వ్యాధి తీవ్రంగా వున్న సందర్భాల్లో కూడా ఒక వారం రోజుల్లో మంచి గుణం కనిపిస్తుంది.

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని 'జమ్మూ' ప్రాంతంలో వున్న పశువైద్య కళాశాలలో ఈ మందును పరీక్షించి దీనిని పశువులపై ఇంకే ఇతర ప్రతికూల ప్రభావాలు ఏమీ చూపవని, దీన్ని క్షేమంగా వాడవచ్చునని నిర్ధారించింది. గుజరాత్ లోని గాంధీనగర్ ప్రాంతంలో పశువులపై ప్రయోగాలు చేసి ఇదే విధమైన నిర్ణయానికి రావటం జరిగింది.

**జాతీయ మూడవ బహుమతి (పశు వైద్యం) :**

**పశువులలో పొట్టవాపు/అజీర్తికి మందు :**





**సుఖ్‌దేవ్ రాయ్, కైలాస్ మిస్త్రీ, సితంరాహి, పశ్చిమ చంపారన్, బీహార్ :**

పశువులు తినకూడని ఆహారం తిన్నా, ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోయినా అజీర్తి వలన ఈ పొట్టవాపు వ్యాధి వస్తూ వుంటుంది. ఇది సహజమే అయినా సరైన సమయం లో వైద్యం అందించకపోతే ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. సుఖ్‌దేవ్ రాయ్ మరియు కైలాస్ మిస్త్రీలు ఈ పరిస్థితుల్లో వున్న పశువులకి మూలికా వైద్యం ద్వారా నయం చేస్తూ వుంటారు.

70 సంవత్సరాల సుఖ్‌దేవ్ రాయ్ ఒక పేద రైతు. ఇతనికి 10 సంవత్సరాల వయసులోనే కష్టాలు మొదలై కుటుంబ భారమంతా తనపై పడింది. చిన్నగా వ్యవసాయం చేస్తూనే ఆదాయం పెంచుకోవటం కోసం పశువులను పెంచ సాగాడు. ఇతని కొడుకులు పట్టణంలో కూలీపని చేస్తూ వుంటారు. భార్య ఇతనికి వ్యవసాయంలో, పశు పోషణలో చేయూతగా వుంటోంది. నాకున్న ఆస్తల్లా మా గురువు గారు నాకు నేర్పిన మూలికా వైద్యమే అంటూ వుంటాడు సుఖ్‌దేవ్. ఆ ప్రాంతంలో మంచి పశువుల వైద్యునిగా ఇతనికి పేరుంది. ఎంతోమంది ఇతడ్ని సలహాలకి, మందులకి సంప్రదిస్తూ వుంటారు. తనవద్దనున్న జ్ఞానం తనతోనే అంతరించి పోకూడదని, తరువాతి తరాలకు కూడా వ్యాప్తి చెందాలి అన్న ఉద్దేశ్యంతో ముగ్గురు శిష్యులకి తన వైద్యయ చిట్కాలు నేర్పించాడు. ఇతను పెట్టిన షరతల్లా "మీరు మూడు వేరువేరు ప్రాంతాల్లో వైద్యం ఉచితంగా చెయ్యాలి. ఈ జ్ఞానాన్ని స్వలాభం కోసం వాడుకోకూడదు" అన్నదే. తాను పేదవాడైనా తనకున్న జ్ఞానంతో డబ్బు చేసుకునే ఆస్కారమున్నా, సామాజిక స్పృహ వుండి, నలుగురికీ మేలు జరగాలని ఉచితంగా వైద్యం చేస్తున్న సుఖ్‌దేవ్

అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.

అభినందనీయుడు. అందుకే ఎన్.ఐ.ఎఫ్. ఇతని ప్రతిభను గుర్తించింది.

50 సంవత్సరాల కైలాస్ మిస్త్రీ కంసాలి అయిన తన తండ్రిఆరుగురు సంతానంలో నాలుగోవారు. తండ్రికి చిన్న ఆభరణాల దుకాణం వుండేది. అక్కడే ఆభరణాలు తయారు చేయడం, అమ్మడం నేర్చుకున్నాడు మిస్త్రీ. 7వ తరగతి వరకు చదువుకున్న తర్వాత చదవు ఆపేసి ఆర్థికంగా తండ్రికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. చిన్నప్పటి నుంచి కూడా ఇతని ఆసక్తి అంతా ఆభరణాల మీద కాక, యంత్రాలపై వుండేది. అది గుర్తించిన తండ్రి సరే నీకిష్టమైన పనే చేసుకో అన్నాడు. దాంతో మిస్త్రీ యంత్రాలను రిపేరు చేయటం నేర్చుకొని ప్రస్తుతం ఒక మోటార్ సైకిల్ రిపేరు షాపులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నారు. భార్య ఇంటి పనులను చూసుకుంటుంటే, తను వర్క్‌షాప్‌లో పని చేస్తూ వుంటాడు.

కొన్ని సంవత్సరాల క్రితం కైలాసం వద్ద ఒక మేక వుండేది. దాన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటూ వుండేవాడు. ఒకరోజు దానికి సుస్తీ చేసి, పొట్టంతా ఉబ్బిపోయింది. ఏం చేయాలని ఆలోచిస్తూ వుండగా, ఎవరో తెలిసిన వాళ్ళు చెప్పిన చిట్కా గుర్తుకు వచ్చింది. స్థానికంగా దొరికే ఒక మూలిక సహాయంతో మందును తయారు చేసి మేకకు తినిపించాడు. అది అద్భుతంగా పని చేయటంతో మేక త్వరగా కోలుకుంది. తనకి తెలిసిన ఈ చిట్కాను నలుగురితో పంచుకున్నాడు. ఎంతోమందికి ఈ మందు తయారు చేసి ఇచ్చాడు.

కడుపు ఉబ్బరం వచ్చిన పశువు చాలా బాధకి లోనై సరైన సమయంలో చికిత్స అందించకపోతే ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. సుఖ్‌దేవ్ రాయ్, కులాస్ మిస్త్రీ ఇద్దరు కూడా స్థానికంగా దొరికే ఒక మూలిక సహాయంతో (పేటెంట్ కారణంగా పేరు తెలపటం లేదు) ఈ ఔషధం తయారు చేసి వాడుతూ వుంటారు. దీనిని పశువుచేత రోజుకి రెండుసార్లు తాగిస్తే రెండు మూడు రోజుల్లో మంచి గుణం కనిపిస్తుంది.

ఎన్.ఐ.ఎఫ్. ఈ ఔషధాన్ని నాగపూర్ పశువైద్య కళాశాలలోని మందుల విభాగంలో ఈ ఔషధాన్ని పరీక్షింపజేసి ఇది పశువుపై ఏ ఇతర ప్రతికూల ప్రభావం చూపకుండా సమర్ధవంతంగా పని చేస్తుందని నిర్ధారించటంతో ఆ ఇద్దరి పేరున ఎన్.ఐ.ఎఫ్. పేటెంట్‌కి దరఖాస్తు చేయటం జరిగింది. ఇప్పుడు ఈ మందుని విస్తృతంగా అందరికీ అందుబాటులో తెచ్చే ప్రయత్నంలో వుంది ఎన్.ఐ.ఎఫ్.

**రాష్ట్రీయ బహుమతి (అసోం) :**

**ఒకదానితో ఒకటి పట్టుకునేలా వుండే ఇటుకల తయారీ యంత్రం (ఇంటర్ లాకింగ్ బ్రిక్ మేకింగ్ మిషన్) :**

**ఉమేష్ చంద్ర శర్మ, నార్త్ లక్ష్మీపూర్, అసోం :**



55 సంవత్సరాల ఉమేష్ చంద్ర ఉత్తర లక్ష్మీపూర్‌కి చెందిన ఒక సృజనాత్మక వ్యాపారస్తుడు. ఈయన ఒకదానితో ఒకటి పట్టుకునేలా (ఇంటర్ లాకింగ్) ఇటుకలను తయారు చేసే యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ ఇటుకల వలన నేర్పరులైన పనివారి అవసరమే లేకుండా సామాన్యులు కూడా తేలికగా, తక్కువ సిమెంటు, ఇసుక మిశ్రమాన్ని వాడి చవకగా ఇళ్ళు కట్టుకోవచ్చు.

ఉమేష్ చంద్ర పెద్ద ధనవంతుడు కాకపోయినా ఎప్పటికైనా ఒక స్వంత ఇల్లు కట్టుకోవాలనే బలమైన కోరిక ఉండటంతో తక్కువ ఖర్చులో ఒకదానికి ఒకటి పట్టుకునేలా ఇటుకలను కనుగొని, దాన్ని తయారు చేసే యంత్రాన్ని నిర్మించుకొని, ఇల్లు కట్టుకున్నాడు! కేవలం 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఉమేష్ కంకర, ఇసుక, సిమెంటు అమ్మి జీవనం సాగించేవాడు. ఇప్పుడు ఈ ఇటుకలు ఇతని ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. ఇతనికి భార్య, ఇంకా చదువుకుంటున్న ఇద్దరు కొడుకులు ఉన్నారు.

**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**




కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఉమేష్ ఒక శాశ్వత గృహం నిర్మించాలనుకున్నాడు. కష్టంమీద అన్నీ సమకూర్చుకొని పని ప్రారంభించాడు. కానీ ఇల్లు కట్టే మేస్త్రీలతో పెద్ద చిక్కు వచ్చి పడింది. ఎంత కూలీ ఇస్తామన్నా మేస్త్రీలు దొరకడం కష్టమైంది. ఇక్కడ పనికి ఒప్పుకుని మరెక్కడికో ఎక్కువ కూలీ వస్తుందని వెళ్ళిపోయేవాళ్ళు. ఈ మేస్త్రీలతో చేదు అనుభవం కారణంగా విసిగిపోయి, వీళ్ళు లేకుండా ఇళ్ళు కట్టుకోలేమా అన్న ఆలోచన వచ్చింది. స్వతహాగా కొత్త కొత్త ఆలోచనలు చేసే ఉమేష్ మేస్త్రీల సహాయం లేకుండా ఒకదానికి ఒకటి అతుక్కుని ఉండేలాంటి ఇటుకలు తయారు చేసే పనిలో పడిపోయాడు. అనేక ప్రయోగాలు చేసి చివరకి ఒక నమూనాను తయారు చేశాడు. వీటి వలన మేస్త్రీ అవసరం లేకుండా సామాన్యులు కూడా తక్కువ ఇసుక, సిమెంటుతో త్వరగా, చవకగా ఇళ్ళు కట్టుకొనే వెసులుబాటు ఉంది. ఈ ఇటుకలను అతను కంకర, సిమెంటు, ఇసుక, నీరు కలిపి తయారు చేశాడు. ఇటుకలు ఒదానితో ఒకటి పట్టుకొని వుండటానికి అనువుగా ఇటుక పైన మరియు క్రింది భాగాలలో "నొక్కులు" ఏర్పాటు చేశాడు. కొన్ని ఇటుకలు తయారు చేయడానికైతే సరిపోతుంది కానీ, ఒక ఇల్లు కట్టడానికి వేలకొద్దీ ఇటుకలు తయారు చేయడానికి అనువుగా యంత్రం తయారు చేయాల్సి వచ్చింది.

మార్కెట్‌లో లభించే యంత్రాలను పరిశీలించి, తానే తనకు అవసరమైన విధంగా ఇటుకలను తయారు చేసే యంత్రాన్ని రూపొందించాడు. 20 నిమిషాల్లో 44 ఇటుకలు తయారు చేసేవిధంగా దీన్ని రూపొందించాడు. ఈ యంత్రం తో మామూలు ఇటుకలు కూడా తయారు చేసుకోవచ్చు. 4 జ 5 జ 2.5 అడుగుల కొలతలు గల ఈ యంత్రం 600 కిలోల బరువు వుంటుంది. సాధారణంగా బైట మార్కెట్‌లో 10 లక్షలు ఖరీదు చేసే ఈ యంత్రాన్ని ఇతను రెండున్నర లక్షల రూపాయల్లోనే చేయగలిగాడు. ఇటువంటివి రెండు యంత్రాలను తయారు చేసి ఒకదాన్ని అమ్మాడు కూడా.

ఇంటర్ లాకింగ్ ఇటుకల వలన చాలా లాభాలు ఉన్నాయి. మామూలు పద్ధతిలోలాగా కాక, ఈ పద్ధతిలో ఇటుకకి, ఇటుకకి మధ్య సిమెంటు, ఇసుక మిశ్రమం వేయ వలసిన అవసరం లేదు. పునాది నుంచి మొదలు పెడితే కావలసిన ఎత్తుకు వచ్చిన తర్వాత కిటికీలకి, ద్వారాలకి 'లెంటల్' వేస్తే చాలు. లేదా కప్పు వరకు వచ్చిన తర్వాత కప్పు వేస్తే చాలు. ఈ పద్ధతిలో చాలా ఖర్చులు, సమయము ఆదా చేసుకోవచ్చు.

ఉమేష్ ఈ ఇటుకలతో తన ఇల్లు కట్టుకోవడమే కాక, పొరుగువారి ప్రహరీ గోడలు కూడా కట్టించి ఇచ్చాడు. జిల్లా అధికారుల నుండి ఇతనికి ఈ పద్ధతి కట్టడం గురించి వాకబులు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణానికి అనువుగా ఈ ఇటుకల వాడకంపై ఎన్.ఐ.ఎఫ్.ని కూడా ఎంతోమంది సంప్రదిస్తున్నారు.

**ఇన్నోవేటర్ ఉమేష్ చంద్ర శర్మ, ఫోన్: 09957957478**

**రాష్ట్రీయ పురస్కారం (జమ్మూ కాశ్మీర్)**

**గ్యాస్‌తో పనిచేసే కాశ్మీరీ 'సమోవర్' (టీ కాచే కేటిల్)**

**షాజియా జాన్, కుల్‌గావ్, జమ్మూ కాశ్మీర్.**

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**




బొగ్గును వాడుతూ సాంప్రదాయ కాశ్మీర్ పద్ధతిలో టీ కాచే కేటిల్‌నే 'సమోవర్' అంటారు. 24 సంవత్సరాల షాజియా జాన్ ఈ సాంప్రదాయ పద్ధతినే కొనసాగిస్తూ బొగ్గు బదులు గ్యాస్ వాడేలా సమోవర్ కేటిల్‌ను రూపొందించింది. కశ్మీరీలు ఎంతో ఇష్టంగా 'నూన్ చాయ్' పేరున తాగే ఉప్పు వేసిన టీ ఈ ఆధునీకరించిన సమోవర్ కేటిల్ సహాయంతో సాంప్రదాయ సంస్కృతిని పాటిస్తూనే తేలికగా, ఆరోగ్యవంతంగా, కంటికి నప్పే విధంగా తయారు చేసింది.

షాజియా ఒక రైతు కుటుంబంలోని రైతు పిల్లలలో చిన్నది. ఆర్థికమైన కష్టాల కారణంగా ఆమె చిన్నతనంలోనే చదువు మానేసి ఇంటిపనులు చేస్తూనే తండ్రికి వ్యవసాయంలో సహాయం చేస్తూ, మిగతా సమయంలో కరెంటు స్విచ్‌లు, పరికరాలు రిపేరు చేస్తూ వుండేది. తండ్రికి బంట్రోతు ఉద్యోగం రావటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంచెం మెరుగుపడింది. ఆయన స్వతహాగా కొత్తరకంగా ఆలోచించేవాడు కనుక షాజియా రిపేరు పనులకు అడ్డు చెప్పలేదు. ఈ కారణం వల్లనే గ్యాస్ సమోవర్ తారు చేయటంలో ఆయన షాజియాకి సహాయ పడగలిగాడు. షాజియా రోజంతా రకరకాల పనులు చేస్తూ వుండటం కారణంగా ఆమెకి అనేక సమస్యలు, సవాళ్ళపై మంచి అవగాహన కుదిరింది.

ఇంట్లో సమోవర్‌ను ఉపయోగించి టీ తయారు చేయటం, పొలంలో పని చేస్తున్న తండ్రికి, సోదరుడికి దానిని అందజేయటం, ఈ క్రమంలో దానిని బొగ్గుతో నింపటం, నిప్పు ఆరిపోకుండా ఉండటానికి గంటలకొద్దీ ఊదటం శ్రమతో కూడుకున్న పని అని ఆమె గమనించింది. పాత పద్ధతిలో బొగ్గు వాడుతూ టీ తయారు చేయటంలో పొగ వల్ల కళ్ళు ఎర్రబడటం, దాన్ని ఊదుతూ వుండటం, దానివలన ఎగిరే నిప్పు రవ్వలు, బూడిద, చేతులు కాలటం, బట్టలు మసిబారటం లాంటివన్నీ గమనించిన ఆమె మనం టీ కాచటానికి బొగ్గు బదులు గ్యాస్ ఎందుకు వాడకూడదు అన్నది తండ్రితో. ఆయన సాంప్రదాయ పద్ధతిలో టీ కాచే ప్రక్రియని మార్చమంటోంది అని ముందు సంశయించాడు. తరువాత చాలా చర్చ జరిగిన తర్వాత సరే ప్రయత్నిద్దాం అన్నాడు. తండ్రి అవును అనటంతో ఆమె ఉత్సాహంగా ఒక బొమ్మ గీసి, ఇలా చేస్తే బావుంటుంది అని తండ్రికి వివరించింది. ఆయనా ఆలోచించి సరే అన్నాడు.

ఆలోచన బాగానే వున్నా, ఈ ఆలోచనని క్రియా రూపంలోకి తీసుకు రావటానికి, వాళ్ళకి కావలసిన విధంగా మార్చబడిన బర్నరు, రెగ్యులేటర్లను తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. తండ్రి కూడా అనేక మంది గ్యాస్ మెకానిక్‌లతో ఈ విషయం చర్చించినా, ఏమీ ఫలితం రాలేదు. ఇలా కాదని, షాజియానే స్వయంగా ఒక నెల రోజులు కష్టపడి తనకు కావలసిన వంకరగా వుండే బర్నర్‌ను తయారు చేసుకుంది. తయారు చేయటమేమిటి, ఆ మర్నాడే తండ్రిని తీసుకుని వెళ్ళి ఒక కమ్మరిచేత దానిని 'సమోవర్'లో



నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.



ఇమిడేలా చేయించింది. అది మొదటిసారి వాడినప్పుడు ఆమెతో పాటు తండ్రి కూడా చాలా గర్వించాడు. అది చూసిన చుట్టుప్రక్కల వాళ్ళు ఆశ్చర్యపోయారు. అవును మరి మొదటిసారి బొగ్గు వాడకుండా 'సమోవర్' పని చేయటం వారు చూడటం అదే కదా!. ఈ గ్యాస్ సమోవర్ మార్పు వార్త చాలా మందికి తెలిసి పోయింది. జమ్మూ కాశ్మీర్ లోని 'గ్యాన్' సంస్థ, విశ్వ విద్యాలయం వారి దృష్టిలో పడి వారు దీనిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

షాజియా సాంప్రదాయంగా వస్తున్న సమోవర్ రూపాన్నేమీ మార్చలేదు. కేవలం బొగ్గు వాడే చోట అదే ప్రదేశంలో ఇమిడేలా చిన్న గ్యాస్ సిలిండరు, బర్నరు, రెగ్యులేటర్లు అమరేలా ఏర్పాటు చేసింది. అంతే కాదు సమోవర్ పైన అవసరమైతే చిన్న వంటకాలు చేసుకోవటానికి అనువుగా ఒక ప్లేటు కూడా ఏర్పాటు చేసింది. మామూలుగా టీ తయారు చేయటానికి 40–45 నిమిషాలు పడితే ఈ గ్యాస్ సమోవర్ వలన కేవలం 10–15 నిమిషాల్లో 25 కప్పుల టీ చేయటానికి వీలవుతుంది. పైగా దీనిలో బూడిద, నిప్పు రవ్వలు, ఊదటం, పొగ లాంటివి ఉండక పోవటమే కాక, అదనంగా వచ్చిన వేడిని పాలు, నీళ్ళు కాచుకోవటానికి, రొట్టెలు చేసుకోవటానికి కూడా వాడుకోవచ్చు.

షాజియా 101వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనగా ఆమె ఆలోచనకి మంచి స్పందన వచ్చింది. మీడియా వారు కూడా మంచి ప్రాచుర్యం కల్పించారు. ఎన్.ఐ.ఎఫ్. వారు జమ్మూ కాశ్మీర్, గ్యాన్ విభాగం దీనిని ఇంకా సురక్షితంగా చేయటానికి సహాయ పడుతున్నారు.

ప్రస్తుతం షాజియా ఈ సమోవర్ వెలిగించటానికి కొత్తరకం లైటర్‌ను రూపొందించే పనిలో వుంది. ప్రతి కాశ్మీరీ ఇంట్లో సమోవర్ తప్పకుండా వుంటుంది. అందరూ ఈ ఆధునీకరించిన సమోవర్ వాడితే ఎంతోమందికి మేలు చేసిన దాన్నవుతాను అంటుందామె. "ప్రతి వ్యక్తి తన జీవితంలో ఏదో ఒక్క సమస్యకైనా పరిష్కారం కనుగొనగలిగితే, ప్రపంచంలో పరిష్కరించలేని సమస్యే ఉండదు" అన్నది షాజియా ఆలోచన.

# గాలిమర నీటిపంపు

(13వ పేజి తరువాయి)

❀ ఆ ప్రదేశంలోని గాలి వేగం, రోజుకు గాలి వీచే సమయాలు, నీటి లోతు వగైరాలమీద ఆధారపడి ఇది పని చేస్తుంది.

❀ ఇన్నోవేటర్ పై విషయాలను బాగా గమనించి గాలిమర నీటిపంపు సాధ్యమని అనిపిస్తే ఆ ప్రాంతానికి తగినట్టుగా ప్రత్యేకంగా డిజైన్ చేసి అమరుస్తాడు. దీని ఖర్చు కూడా డిజైన్‌పైన ఆధారపడి వుంటుంది.

❀ అమర్చిన తర్వాత కూడా ఇదంతా ప్రయోగాత్మక కార్యం కాబట్టి ఒక స్థాయికి తీసుకు రావడానికి కొంత సమయం పడతుంది, మరికొంత ఖర్చవుతుంది.

❀ గ్రామీణ శాస్త్రవేత్త పటాన్ సైదా మీలో ఒకరు కాబట్టి ఆయన్నుంచి పెద్ద పరిశ్రమలు సరఫరా చేసే స్థాయిలో ఆశించడం సమంజసం కాదు.

రైతులు – ఇన్నోవేటర్లు ఇద్దరినీ సంధానం చేయడానికి వీరిద్దరి సమన్వయంతో కార్యం విజయం చేయడానికి పల్లెసృజన పూర్తిగా, స్వచ్ఛందంగా తోడ్పడు తుంది. మా ఉద్దేశ్యంలో ఇలాంటి ప్రయోగాలు విశ్వాసంతో కూడుకున్నవి. ఆర్థిక లాభాలు, కాంట్రాక్టు కాగితాలు, గ్యారంటీలు, వారంటీలు సమయ అవరోధాలు ఇవన్నీ ప్రధానం కాదు.

**ఇన్నోవేటర్ పటాన్ సైదా (ఫోన్ : 93478 87636) సంప్రదించి ఏర్పాటు చేసుకోగలరు.**

**కష్టాల సారాంశమే విజయం.**

# మేథో సంపత్తి (పేటెంట్) యాజమాన్యం



జ్ఞానం ఎంత ముఖ్యమైందో దానిని రక్షించుకోవటం కూడా అంతే ముఖ్యం. పునాది స్థాయి ఇన్నోవేటర్లు, సాంప్రదాయ జ్ఞానుల వద్ద అపారమైన జ్ఞానముంది. ఈ విషయంలో ఎన్.ఐ.ఎఫ్. వారి జ్ఞానం యొక్క నిజమైన విలువను గ్రహించి, వారికి మేథో సంపత్తి రక్షణ కల్పించడానికి పూర్తి చేయూతనివ్వటానికి ఎల్లప్పుడూ సహకరిస్తుంది. ఈ క్రమంలో ఎన్.ఐ.ఎఫ్. వారి 'మేథో సంపత్తి నిర్వహణా విభాగం' ద్వారా 'ప్రియర్ ఆర్ట్ సర్చ్' చేయటం, పేటెంట్ అప్లికేషన్‌లను తయారు చేయటం, నింపటం లాంటి పనులు చేయటమే కాక, ప్రపంచ వ్యాప్తంగా పేటెంట్లకు దరఖాస్తు చేయటానికి, ట్రేడ్ మార్కులకి, ఇతర మేథో సంపత్తి రక్షణ చర్యలు, వారికి కావలసిన చట్టపరమైన సహాయము, లైసెన్సింగ్ ఒప్పందాలను రూపొందించటము, ప్రత్యేకంగా జాతీయ రిజిస్ట్రారు వద్ద పునాది స్థాయి, భారతదేశ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన విషయాలపై చట్టపరమైన సహాయం అందించటం, మేథో సంపత్తి హక్కులని రక్షించటము, వీటినిఉచితంగా లేదా రుసుములు చెల్లించాల్సి వస్తే దానికి తగ్గ ఆర్థిక సహాయము చేసే మార్గాలు మొదలైన విషయాలలో చేయూతనిస్తుంది. మేథో సంపత్తి రక్షణ విషయంలో ఎన్.ఐ.ఎఫ్. చాలా పురోగతి సాధించింది. ఇప్పటివరకు ఎన్.ఐ.ఎఫ్./ దాని అనుబంధ సంస్థలు భారతదేశంలో పేటెంట్‌లకై 743 దరఖాస్తులు చేయగా, 39 పేటెంట్లు మంజూరు చేయబడినవి. అదేవిధంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 8 పేటెంట్లకు దరఖాస్తు చేయగా, 5 మంజూరు చేయబడినవి. ఇదే సమయంలో 10 ట్రేడ్ మార్కులకై దరఖాస్తు చేయటం జరిగింది. అదేవిధంగా 15 డిజైన్ దరఖాస్తులు చేయగా, ఏడింటికి అనుమతి లభించింది. వీటితో పాటు ఎన్.ఐ.ఎఫ్. రైతుల కొరకు 38 మొక్కల రకాలకి పి.పి.వి. & ఎఫ్.ఆర్.ఎ.కి దరఖాస్తు చేసి ఐదింటిని నమోదు చేయగలిగింది.

**భారతదేశంలో పేటెంటుకై దరఖాస్తు చేసే పద్ధతి :**

భారతదేశంలో పేటెంటుకై దరఖాస్తు చేయటానికి 'ఫారం-1, ఫారం-2, ఫారం-3, ఫారం-5' రూపంలో పేటెంటు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి. ఇది కేవలం 'ఇన్నోవేటివ్ రీసర్చ్ & డెవలప్‌మెంట్'కు మాత్రమే పనికి వస్తుంది. పేటెంటు కార్యాలయం వారు దరఖాస్తు

పైదాకా ఎక్కటానికి శక్తి కావాలి. అది హిమాలయాలైనా సరే, నీ వృత్తిలోనైనా సరే.

దారుడు తానున్న ప్రదేశం నుండే 'ఆన్‌లైన్' ద్వారా దరఖాస్తు చేయదలచుకుంటే ఇ–ఫైలింగ్ క్రింది లింక్‌ద్వారా చేయవచ్చు

http://ipindiaonline.gov.in/epatentfiling/goForLogin/doLogin

స్వయంగా దరఖాస్తు చేయదలచుకున్నవారు ఢిల్లీ, కలకత్తా, ముంబై, చెన్నయ్ లలో గల పేటెంటు కార్యాలయాలలో చేసుకొనవచ్చు. అయితే దీనికై 10 శాతం అదనపు ఫీజు చార్జీలు చెల్లించవలసి వుంటుంది. భారతదేశంలో వున్న పేటెంటు కార్యాలయాలు, వాటి కార్యనిర్వహణా పరిధి ఈ క్రింది విధంగా వుంటుంది.

| కార్యాలయము | పరిధి |
|---|---|
| ముంబై | మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, ఛత్తీస్‌ఘడ్, కేంద్రపాలిత ప్రాంతమైన నాగర్ హవేలి |
| చెన్నయ్ | ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతం పోర్ట్‌బ్లేయర్ |
| న్యూఢిల్లీ | హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఛండీఘర్. |
| కలకత్తా | భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలు. |

పేటెంటు కార్యాలయంలో దరఖాస్తు చేసేముందు పూర్తి వివరాలు నిర్దేశించిన పద్ధతిలోనే దరఖాస్తు ఫారంలో నింపవలసి వుంటుంది. ఒకవేళ మీ ఇన్నోవేషన్ దాదాపు పూర్తయ్యే దశలో వున్నట్లయితే ముందుగా తాత్కాలిక పేటెంటుకై దరఖాస్తు చేసుకొని, ఆ తర్వాత పూర్తి పేటెంటుకై 12 మాసాల లోపల దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది.

పేటెంటుకై దరఖాస్తు చేసుకొన్న 18 నెలల తర్వాత దాని వివరాలు ప్రజోపకార్థమై ప్రచురించడం జరుగుతుంది. ఇంతకన్నా త్వరగా మీకు పని జరగాలి అనుకుంటే ఫారం–9లో మీరు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఒక నెల తర్వాతనే ఇటువంటి ప్రచురణ చేసే అవకాశం వుంటుంది.

తర్వాతి దశలో ఫారం–18లో మీరు మీ ఇన్నోవేషన్‌ని పరీక్ష చేసుకోమని కోరగా కంట్రోలర్ ఒక పేటెంట్ ఎగ్జామినర్ ద్వారా మీ ఇన్నోవేషన్ పేటెంట్ చేయటానికి అర్హత కలిగినదా లేదా అని తెలుపడానికి నియోగించడం జరుగుతుంది.

ఈ అధికారి ఇన్నోవేషన్‌ని సమూలంగా పరీక్షించి, తన నివేదికలో 'ప్రియర్ ఆర్ట్ సర్చ్' వివరాలు, ఇన్నోవేషన్ వివరాలు ఆ ఇన్నోవేషన్ పేటెంట్‌కి అర్హమైనది అవునా, కాదా అని పేర్కొంటాడు. అతను లేవదీసిన అభ్యంతరాలకి తగిన సమాధానం నిర్ణీత కాలంలో ఇచ్చినట్లయితే పేటెంటుకి అర్హత వున్నది అని అతను తన నివేదికలో పేర్కొంటాడు. ఆ తర్వాత అతనికి పేటెంటు మంజూరు చేయబడినది అని పేటెంట్ జర్నల్ లో ప్రచురించిన తర్వాత అతనికి పేటెంట్ పత్రాన్ని అందజేయటం జరుగుతుంది.

పేటెంట్ దరఖాస్తుకి సంబంధించిన వివిధ ఫారాలు అవి ఏ సందర్భాలలో సమర్పించాలో ఈ క్రింద వివరించటం జరిగింది.

**ఫారం–1 పేటెంటు మంజూరుకై దరఖాస్తు :**

పేరులో వున్నట్లుగానే భారతదేశంలో పేటెంటు కావాలి అనుకున్న వారు ఈ ఫారములో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఫారంలో ఇన్నోవేటర్ పేరు, చిరునామా, దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, చిరునామాలు, ప్రస్తుత ఇన్నోవేషన్ లాంటివే ఇంతకు ముందే వున్నట్లయితే వాటి వివరాలు, అవి ఎవరి పేరున వున్నయో వారి వివరాలు, కొన్ని ప్రత్యేక డిక్లరేషన్‌లు మొదలైన వివరాలు వుంటాయి.

**ఫారం–2 – తాత్కాలిక పేటెంటు/ ఇన్నోవేషన్ పూర్తి వివరాలు :**

ఈ ఫారంలో పేటెంట్ చేసున్న ఇన్నోవేషన్ యొక్క దశను బట్టి తాత్కాలిక పేటెంటు అయినట్లయితే ఆ దశ వరకు పూర్తయిన వివరాలు, లేదా పూర్తి అయినట్లయితే మొత్తం వివరాలు ఇవ్వాల్సి వుంటుంది. దరఖాస్తుతో పాటు జత చేసిన కాగితాలు (డ్రాయింగ్ షీట్లను కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది) చేసిన క్లెయిముల ఆధారంగా అదనపు ఫీజు చెల్లించవలసి వుంటుంది (30 కాగితాలు, 10 క్లెయిములకి మించినచో అదనపు ఫీజు వుంటుంది).

**ఫారం–3 – సెక్షన్–8 క్రింద స్టేట్‌మెంట్ మరియు అండర్**

విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.

**పేటెంటు కార్యాలయం ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజుల వివరాలు**

**దరఖాస్తు నేరుగా చేసుకుంటే ఈ ఫీజులకు 10 శాతం రుసుము అదనంగా చెల్లించవలసి వుంటుంది.**

**పేటెంటు దరఖాస్తు ఫీజు 1600/-**

**పేటెంటు ప్రచురణ కొరకు 2500/-**

**పేటెంటు అప్లికేషన్ పరీక్ష ఫీజు : 4,000/-**

గమనిక : ❀ మీ దరఖాస్తు 30 పేజీలు దాటితే ప్రతి అదనపు పేజీకి రూ. 160/– చొప్పున అదనపు రుసుము చెల్లించాల్సి వుంటుందిం.

❀ పేటెంటు దరఖాస్తులో 10కన్నా ఎక్కువ క్లెయిములు ఉంటే ప్రతి అదనపు క్లెయిముకి రూ. 320/–ల చొప్పున చెల్లించాల్సి వుంటుంది.

❀ పూర్తి వివరాల కొరకు

http://ipindia.nic.in/ipr/patent/patents.htm

వెబ్‌సైట్‌ను సందర్శించండి.

**టేకింగ్ :**

ఈ ఫారము ప్రస్తుత ఇన్నోవేషన్‌కు సంబంధించి ఇతర దేశాలలో చేసిన పేటెంట్ దరఖాస్తుకు సంబంధించిన వివరాలు పొందుపరచాల్సి వుంటుంది. ఈ ఫారం నింపడం ద్వారా పేటెంటు దరఖాస్తు దారులు బయటి దేశాలలో చేసుకున్న పేటెంటు దశ, వివరాలు ఎప్పటికప్పుడు పేటెంటు ఆఫీసుకి వ్రాతపూర్వకంగా తెలియజేస్తానని డిక్లరేషన్ ఇవ్వాల్సి వుంటుంది.

**ఫారం–5 – ఇన్నోవేటర్ యొక్క డిక్లరేషన్ :**

ఈ ఫారం నింపడం ద్వారా ఇన్నోవేటరు ఏ అంశాలపై రక్షణ కోరుతున్నాడో ఆ అంశాలను తెలియజేయవలసి వుంటుంది.

**ఫారం–9 – ప్రచురణకై విన్నపము :**

ఒక ఇన్నోవేషన్‌పై పేటెంటుకై దరఖాస్తు చేసుకొన్న 18 నెలల తర్వాత ఆ పేటెంట్ వివరాలు ప్రచురించడం జరుగుతుంది. దానికన్నా ముందు మీరు త్వరగా పని జరగాలని అనుకుంటే ఫారం–9 ద్వారా విన్నవించుకోవచ్చు. ఈ ఫారం నింపిన తర్వాత సాధారణంగా ఒక నెల తర్వాత ప్రచురించడానికి వీలవుతుంది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే ఈ ప్రచురణ జరిగిందంటే దాదాపుగా పేటెంటు వచ్చినట్లే. కాకపోతే పేటెంటు పత్రం మీ చేతికి అందిన తర్వాతనే ఇది అమల్లోకి వస్తుంది.

**ఫారం–18 – పేటెంటుకై పరీక్ష చేసుకోవలసిందిగా దరఖాస్తు :**

పేటెంటుకై దరఖాస్తు చేసుకున్న తేది నుండి 48 నెలల్లో తన ఇన్నోవేషన్‌ను పరీక్ష చేసుకోవాల్సిందిగా ఈ ఫారం ద్వారా కోరవచ్చు. ఈ ఫారం సమర్పించేంత వరకు పేటెంటు కార్యాలయము పేటెంటుపై ఎటువంటి చర్య చేపట్టదు. కనుక పేటెంటు త్వరగా పొందాలనుకునే వారు ఫారం–9, ఫారం–18 లను సరైన సమయంలో సమర్పించుకోవటంలో జాగ్రత్త వహించాలి.

మరిన్ని వివరాలకు తరువాయి పేజీలో ప్రచురించిన ప్రశ్నోత్తరాలు చదవండి. ●

**NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ**

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**ఒక దేశం అవినీతి లేకుండా అందమైన ఆలోచనలు కల మేధస్సుతో నిండి ఉండాలంటే నా గట్టి నమ్మకం అది ముగ్గురే చెయ్యగలరు. ఒకరు అమ్మ, రెండు నాన్న, మూడు గురువు.**

# పునాది స్థాయి ఇన్నోవేటర్ల మేథో సంపత్తి (పేటెంట్) హక్కుల పరిరక్షణలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) పాత్ర



భారత దేశంలో పునాది స్థాయిలో ఇన్నోవేటర్లు/ సాంప్రదాయ జ్ఞానకర్తల మేథో సంపత్తి హక్కులను రక్షించటం లో ఎన్.ఐ.ఎఫ్. పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందిస్తూ వుంటుంది అన్నది చాలా మందికి తెలియదు. ఈ విషయంలో ఉత్పన్నమయ్యే సందేహాలకు ఎన్.ఐ.ఎఫ్. సమాధానాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాం.

**1. 'మేథో సంపత్తి' (పేటెంటు) అంటే ఏమిటి?**

జ. 'మేథో సంపత్తి' అన్న పదం సృజనలకి, వస్తువులు తయారు చేసే ఆలోచనలకి లేదా తెలివి తేటలకి సంబంధించినది. దీనిలో ఇన్నోవేషన్లు, సాహిత్యపరమైన మరియు కళాత్మకమైన రచనలు, మొక్కల రకాలు, గుర్తులు, పేర్లు, రూపాలు, డిజైన్లు, వ్యాపార రహస్యాలు మొదలైనవి కలిసి వుంటాయి. వీటికి సంబంధించిన హక్కులను మేథో సంపత్తి హక్కులు అంటారు.

**2. భారత దేశంలో ఎన్ని రకాల 'మేథో సంపత్తి' హక్కులకి రక్షణ ఉన్నది?**

జ. భారతదేశంలో పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్ మార్కులు, ఇండస్ట్రియల్ డిజైన్లు, భౌగోళిక హద్దుల సూచించటం, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ల భౌగోళిక అంశాల డిజైన్లు, వ్యాపార రహస్యాలు, మొక్కల రకాలు, రైతుల హక్కులు మొదలైన వాటికి రక్షణ వుంటుంది.

**3. 'పేటెంట్' అంటే ఏమిటి?**

జ. పేటెంట్ అంటే ఏదైనా 'ఆవిష్కరణ' (ఇన్వెన్షన్)కు సంబంధించిన మేథో సంపత్తి రక్షణ. ఏదైనా ఇన్వెన్షన్ చేసిన వ్యక్తికి ఒక నిర్ణీత కాలం వరకు ఆ వస్తువును ఇంకెవ్వరూ తయారుచేయకుండా, వాడకుండా, విక్రయించకుండా, అటువంటి వస్తువు/ పద్ధతి దిగుమతి చేసుకోకుండా ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేకమైన హక్కు.

**4. ముందుగా చేసే 'ప్రియర్ ఆర్ట్ సర్చ్' అంటే ఏమిటి?**

జ. ఒక ఇన్నోవేషన్‌కి సంబంధించిన సమాచారం, వివరాలు ప్రజల వద్ద ఇంతకు ముందే వ్రాత పూర్వకంగా గానీ, మౌఖికంగా గానీ, వాడుక రూపంలో గానీ, ఇంకే రూపంలో గానీ ఉన్నదా అని తెలుసుకోవటానికి చేసే ప్రయత్నమే 'ప్రియర్ ఆర్ట్ సర్చ్' అంటారు.

**5. ఒక ఇన్నోవేటర్‌గా నేను 'ప్రియర్ ఆర్ట్ సర్చ్' చేయవలసి వుంటుందా?**

**ఒక్కొక్కప్పుడు బడి మానేసే స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు. కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**

జ. తప్పకుండా చేయవలసి వుంటుంది. దీనివలన ఇంతకు ముందే వున్నది మీరు మళ్ళీ చేయవలసిన అవసరం వుండదు. మీరు ప్రియర్ ఆర్ట్ సర్చ్‌ని సక్రమంగా చేస్తే, మీరు చేయబోయే ఇన్నోవేషన్‌కి సంబంధించిన సాంకేతిక వివరాలు గుర్తించి ఏయే రంగాలలో మీరు మార్పులు చేయవచ్చునో, ఇంకా కొత్త రకంగా చేయవచ్చునో లేదా అభివృద్ధి చేయటానికి, విలువ పెంచటానికి, వస్తువు ఉత్పత్తి చేయటానికి, వ్యాపార వృద్ధికి, మీ ఇన్నోవేషన్‌ని వ్యాపారాత్మకంగా లేదా ఇతర అవసరాలకి వాడుకోవటానికి తగ్గట్టుగా రూపొందించుకోవడానికి అవకాశం వుంటుంది.

**6. నా ఇన్నోవేషన్‌కి ఇండియాలో పేటెంట్ తీసుకుంటే ఇతర దేశాల్లో కూడా దానికి రక్షణ వుంటుందా?**

జ. ఉండదు. పేటెంట్ హక్కులు అన్నవి ప్రాంతానికి సంబంధించినవి. భారతదేశంలో పొందిన పేటెంట్‌కు ఇక్కడ మాత్రమే రక్షణ వుంటుంది. అదేవిధంగా అమెరికాలో పొందిన పేటెంట్ కి అక్కడ మాత్రమే రక్షణ వుంటుంది. మీ ఇన్నోవేషన్‌కి అమెరికాలో రక్షణ కావాలి అని అనుకుంటే అక్కడ వేరేగా పేటెంట్‌కి దరఖాస్తు చేసుకోవాలి.

**7. ఆలోచనలను పేటెంట్ చేయవచ్చునా?**

జ. ఆలోచనలను పేటెంట్ చేయడానికి వీలు లేదు. మీ ఆలోచనకి సుస్థిర రూపం వచ్చినప్పుడు మాత్రమే 'తాత్కాలిక పేటెంట్' కి దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

**8. 'ట్రేడ్ మార్క్' అంటే ఏమిటి?**

జ. 'ట్రేడ్ మార్క్' అంటే కనిపించే చిహ్నము. దీనిలో ఒక పదము, సంతకము, పేరు, వస్తువు, లేబుల్, అంకెలు, వ్యాపార వస్తువులు, సేవలని గుర్తించటానికి వాడే రంగుల కలయిక మొదలైనవి వుండవచ్చు. ఇవి ఏ వస్తువులు/ సేవలు ఎవరు చేస్తున్నారో లేదా అందిస్తున్నారో గుర్తించటానికి నిర్దేశించబడినది.

**9. 'కాపీ రైట్' అంటే ఏమిటి?**

జ. ఎవరైనా ఒక వ్యక్తి సాహిత్య రూపంలో, నాటక రూపంలో, సంగీత రూపంలో, కళ రూపంలో లేదా సినిమాలు తీసే నిర్మాతలకి, ధ్వని రికార్డింగులకి, ఒకరు చేసినవి మరొకరు తిరిగి చేసే అవకాశం లేకుండా, వాడుకోకుండా, తర్జుమా చేయకుండా మొదలైన హక్కుల సముదాయాన్నే 'కాపీరైట్' హక్కులు అంటారు.

**10. నేను అభివృద్ధి చేసిన మొక్కల రకాన్ని రక్షించుకో గలనా?**

జ. తప్పకుండా. భారత దేశంలో ఈమధ్యనే 'ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ & ఫార్మర్స్ రైట్స్ యాక్ట్'ను రూపొందించి, దీని ద్వారా మొక్కల రకాలు, రైతుల హక్కులని పరిరక్షించడం జరుగుతోంది.

**11. భారత దేశంలో ప్రస్తుతం ఎన్ని రకాల మొక్కలకి రక్షణ లభిస్తోంది?**

జ. భారతదేశంలో పి.పి.వి.ఎఫ్.ఆర్. చట్టం క్రింద మినుములు, గోధుమలు, శనగలు, బఠాని, పెసలు, అనప/ రాజ్మా, పప్పుదినుసులు, మొక్కజొన్న, సజ్జలు, కందులు, బియ్యము, జొన్న ఈ పన్నెండు రకాలు ఈ చట్టం ప్రకారం గుర్తించ బడినవి.

**12. నేను రూపొందించిన ప్రత్యేకమైన డిజైన్‌ను రక్షించుకో గలనా?**

జ. తప్పకుండా. డిజైన్లన్నీ 'డిజైన్స్ చట్టం–2000' ప్రకారం రక్షించ బడతాయి. 'డిజైన్' అంటే ఏదైనా ఒక రూపము, ఒక పద్ధతి, ఒక నమూనా, నగిషీ, గీతల పద్ధతి, రంగు లేదా రంగులు.... ఇవన్నీ ఏదైనా 'టూ డైమెన్షనల్' లేదా 'త్రీ డైమెన్షనల్' లేదా రెండూ కలిసిన వస్తువుకు ఏదైనా పారిశ్రామిక పద్ధతిలో లేదా మరేదైనా పద్ధతిలో చేతితో కాని, మెకానికల్‌గా కానీ, రసాయనికంగా కాని, విడివిడిగా కానీ, కలిపి కానీ కంటికి కనిపించే విధంగా ఉన్నట్లయితే దానిని 'డిజైన్' అనవచ్చు. దీనిలో మెకానికల్ వస్తువులు, ట్రేడు మార్కులు చేరవు.

**13. 'జియాగ్రఫికల్ ఇండికేషన్స్' (భౌతిక గుర్తింపులు) అనగా నేమి?**

జ. ఒక ప్రదేశం నుండి ఉత్పన్నమైన లేదా పుట్టిన ఒక వస్తువు, దాని లక్షణాలు, పరపతి గుర్తించటానికి వాడే వాటినే భౌతిక గుర్తింపులు అంటారు. ఉదా.: చాలా వ్యవసాయ ఉత్పత్తులు అవి పుట్టిన ప్రదేశము, స్థానిక స్థితి గతులు, వాతావరణం, భూమి కారణంగా ప్రత్యేక లక్షణాలు కలిగి

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**

వుంటాయి. డార్జిలింగ్ టీ, పటోలా సిల్క్, కాంచీపురం శిల్క్, పోచంపల్లి శిల్క్, నిర్మల్ బొమ్మలు, ఏతి కొప్పాక బొమ్మలు మొదలైనవి.

**14. 'లే అవుట్' డిజైన్లకి, 'ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్'లకి ఏమైనా రక్షణ ఉన్నదా?**

జ. ఉన్నది. భారతదేశంలోని 'సెమీ కండక్టర్ ఇండిగ్రేటెడ్ సర్క్యూట్స్ లే–అవుట్ డిజైన్స్ యాక్ట్–2000' ప్రకారం వీటికి రక్షణ ఉన్నది.

**15. వ్యాపార రహస్యాలు అంటే ఏమిటి? ఇన్నోవేటర్‌గా నాకు ఈ విధమైన రక్షణ పనికి వస్తుందా?**

జ. ఏదైనా ఒక వ్యాపారస్తుడు చాలా డబ్బు, సమయము, వనరులు ఖర్చు చేసి పోటీదారులకన్నా ముందుండటానికీ, తనవ్యాపారం ఎదుటివారి వ్యాపారం కన్నామ ఎక్కువగా జరగటానికి సమకూర్చుకున్న సమాచారాన్ని 'ట్రేడ్ సీక్రెట్' (వ్యాపార రహస్యం) అనవచ్చు. దీనిక సాధారణంగా చెప్పుకునే ఉదాహరణ కోకో–కోలా. వ్యాపార రహస్యాల రక్షణ ఉపయోగం ఏమిటంటే.... మీ సమాచారం, సాంకేతిక వివరాలు ప్రజలకు చెప్పనవసరం లేదు. మీ ఇన్నోవేషన్ యొక్క సాంకేతిక వివరాలు ఇతరులకి చెప్పకూడని పరిస్థితుల్లో మాత్రమే ఈ చట్టం మీకు వర్తిస్తుంది.

**16. నా మేథో సంపత్తి హక్కుల పరిరక్షణలో ఎన్.ఐ.ఎఫ్. పాత్ర ఏమిటి?**

జ. పునాది స్థాయి ఇన్నోవేటర్ల మేథో సంపత్తి హక్కుల పరిరక్షణకై ఎన్.ఐ.ఎఫ్. కట్టుబడి వుంటుంది. మేము ముందుగా మీకు 'ముందస్తు ఒప్పంద పత్రం' (పిఐసి) అందజేస్తాము. దాని ద్వారా మీ ఇన్నోవేషన్‌పై మీకు కావలసిన మేథో సంపత్తి హక్కుల రక్షణ విషయంలో అభిప్రాయం సేకరిస్తాం. మీకు మీ హక్కుల పరిరక్షణ కావాలి అని ఒప్పుకుని దానిపై సంతకం చేసిన తరువాతనే మా బృందం మీకు పేటెంట్ హక్కుల దరఖాస్తు నింపటంలో సహాయ పడుతుంది. దీనికి అవసరమైన ఖర్చులన్నీ ఎన్.ఐ.ఎఫ్. భరించి, మీ పేరునే పేటెంట్ నమోదు చేయిస్తుంది.

**17. ఎన్.ఐ.ఎఫ్. నుండి మేథో సంపత్తి హక్కుల పరిరక్షణకై ఎవరు అర్హులు?**

జ. మా పోటీలకి ఎంట్రీలు పంపిన అందరికీ ఎన్.ఐ.ఎఫ్. మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ కల్పిస్తుంది. అయితే ఆ ఇన్నోవేషన్ యొక్క కొత్తదనము, వ్యాపార పటిమ, సమాజానికి దానివల్ల జరిగే మేలు పరిగణలోకి తీసుకుని దేనికి పేటెంట్‌కు సిఫారసు చేయాలో నిర్ణయించడం జరుగుతుంది.

**18. ఎన్.ఐ.ఎఫ్. ఎవరి పేరున పేటెంటు దరఖాస్తు చేస్తుంది? నా పేరునా? ఎన్.ఐ.ఎఫ్. పేరునా?**

జ. ఖచ్చితంగా మీ పేరుననే. ఎన్.ఐ.ఎఫ్. కేవలం మీకు సహాయ కారిగా నిలుస్తుంది.

**19. నా పేరున దరఖాస్తు చేయటానికి నేను ఎన్.ఐ.ఎఫ్.కు ఏమైనా డబ్బు చెల్లించాల్సి వుంటుందా?**

జ. ఏమీ చెల్లించనవసరం లేదు. పునాది స్థాయి ఇన్నోవేటర్లకు చేయూతను ఇవ్వటానికి ఏర్పాటు చేయబడిన ఎన్.ఐ.ఎఫ్. మీ పేరునే ఉచితంగా దరఖాస్తు చేస్తుంది.

**20. పి.ఐ.సి. (ముందస్తు ఒప్పంద పత్రం) ఫారం అంటే ఏమిటి? అది ఎక్కల లభిస్తుంది?**

జ. పి.ఐ.సి. అంటే ప్రియర్డ్ ఇన్‌ఫార్మ్‌డ్ కన్సెంట్ (ముందస్తు ఒప్పందం) చాలా సంవత్సరాలు శ్రమించి ఒక ప్రశ్నా పత్రంలా దీన్ని రూపొందించడం జరిగింది. దీనిలో విలువ పెంచటం, మేథో సంపత్తి రక్షణ అంశాలు, మీ ఇన్నోవేషన్‌ను వ్యాపారీకరణ చేయటం మొదలైనవి వుంటాయి. ఇది ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌లో గాని, దాని అనుబంధ సంస్థల్లో (పల్లెసృజన) కూడా పొందవచ్చు. మా బృందం పిఐసి లోని ప్రతి అంశము మీకు వివరించి, అర్థం చేసుకోవడానికి ఎల్లవిధాలా సహకరిస్తుంది.

**21. నేను పిఐసి ఫారం సంతకం చేయకపోతే ఎన్.ఐ.ఎఫ్. నా మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ చేయదా?**

జ. చేయలేదు. మీరు ఒప్పుకొని, పిఐసి లో సంతకం చేస్తేనే ఎన్.ఐ.ఎఫ్. మీ మేథో సంపత్తి హక్కులపై పాటుపడే అవకాశం వుంటుంది.

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

**22. నేను ఎన్.ఐ.ఎఫ్. నుండి మేథో సంపత్తి పరిరక్షణ హక్కులు పొందాలి అంటే తప్పనిసరిగా మీ పోటీల్లో పాల్గొనాలా?**

జ. అవును. తప్పనిసరిగా పాల్గొన్న వారికి మాత్రమే ఈ సదుపాయం ఉంటుంది.

**23. ఎన్.ఐ.ఎఫ్. నుండి నేను మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ పొందాలి అంటే ఏయే వివరాలు తెలపాల్సి వుంటుంది?**

జ. మొట్టమొదట మీ విద్యార్హతలు, మీ వృత్తికి సంబంధించిన అర్హతలు వివరించాల్సి వుంటుంది. ఇవి మీరు పునాది స్థాయి ఇన్నోవేటర్లు అని నిర్ధారించడానికి వీలవుతుంది. తరువాత ముఖ్యమైనది మీ ఇన్నోవేషన్‌కు సంబంధించిన పూర్తి సాంకేతిక వివరాలు తెలపాల్సి వుంటుంది.

**24. ఏదైనా ఒక వకీలుకి పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వటం క్షేమ దాయకమేనా? ఇండియన్ పేటెంట్ వెబ్‌సైట్‌లో 'పేటెంట్ లాయర్ ద్వారా దరఖాస్తు చేయాలంటే అతనికి పవర్ ఆటార్నీ ఇవ్వాల్సి వుంటుంది అని వుంది. నాకు చెప్పకుండా నా ఇన్నోవేషన్ వివరాలు ఆ వకీలు దుర్వినియోగం చేస్తే?**

జ. పేటెంట్ యాక్ట్స్ ప్రకారం మీరు స్వయంగా కాక, మీ లాయరు ద్వారా దరఖాస్తు చేయదలచుకుంటే అతనికి 'పవర్ ఆఫ్ అటార్నీ' ఇవ్వవలసి వుంటుంది. పేటెంట్ చట్టం 1970, పేటెంట్ రూల్స్ 2003 ప్రకారం ఫారం–26 క్రింద మీరు ఈ పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వవలసి వుంటుంది. ఇది కేవలం పేటెంట్ కార్యాలయంలో మీ బదులు అతను పేటెంటు దరఖాస్తు చేయటానికి మీరు ఇచ్చిన హక్కు మాత్రమే. దీని ప్రకారం అతినికి కేవలం మీ తరుపున దరఖాస్తు చేసే పని మాత్రమే అప్పజెపుతున్నాం. ఆ వకీలు మీ విషయంలో చట్టేతర పనులకి పాల్పడితే (మీ ఇన్నోవేషన్ వివరాలు బయటకి చెప్పినా, స్వంతంగా వాడుకున్నా) మీరు పరిష్కారం కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకొనవచ్చు. ●


**ఏదైనా సమస్యకు పరిష్కారం చూపి, ఇతరుల జీవితాలను మెరుగు పరిచి, మీకు బహుమానం సంపాదించి పెట్టగల సాంకేతిక పరమైన ఆలోచన మీవద్ద ఏదైనా ఉన్నదా?**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా** అహమ్మదాబాద్ సమర్పించు

**ఇగ్నైట్-2016**

**పాఠశాల విద్యార్థులకై స్వంత సాంకేతిక ఆలోచన మరియు ఇన్నోవేషన్ల పోటీ**

దరఖాస్తులు ఆగస్టు **31, 2016** వరకు ఆమోదించబడతాయి.

మీయొక్క లేదా ఇతరుల జీవితాలను లేదా పనిని సులభతరం చేసే కొత్త యంత్రాలు/ పరికరాలు లేదా ఇంతకుముందే వున్న వాటినిసాంకేతికపరంగా అభివృద్ధి చేసే పద్ధతులకై వెతుకుతున్నాం.

ప్రత్యేకంగా వున్న ఇన్నోవేటివ్ ఆలోచనలకి, ఇన్నోవేషన్లకి వీలైతే పేటెంట్ పొందటానికి మరియు వ్యాపార అభివృద్ధి అవకాశాలకి సహాయం అందించటమే కాక, సాంకేతిక, ఆర్థిక సహాయం కూడా అందిస్తాం.

మీవద్ద ఏదైనా సృజనాత్మకమైన ఆలోచన ఉన్నట్లయితే వచ్చి పాల్గొనండి.

**దరఖాస్తులు పంపవలసిన / వివరాలకై సంప్రదించ వలసిన చిరనామా :**

**IGNITE - 16**
National Innovation Foundation - India,
Bungalow, No. 1, Satillite Complex, Prem Chand Nagar Road,
Ahmedabad - 380 015., Gujarat. Ph.: 079-2673 2095, 2673 2456
E-mail : ignite14@nifindia.org, http://nif.org.in/submitidea.php

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678
**E-mail : president@pallesrujana.org, www.pallesrujana.org**

*మీ దరఖాస్తులలో దయచేసి మీ ఆలోచనలు, ఇన్నోవేషన్లు, చిత్రాలు ఉంటే దయాగ్రమ్ (ఉంటే) తో పాటు మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, చదువుతున్న తరగతి, పాఠశాల/ కళాశాల పేరుతో పాటు తప్పక వ్రాసి పంపవలెను.


**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**

# స్పందన

ఎడిటర్ గారికి,

నమస్కారములు. 'పల్లెసృజన' జనవరి–ఫిబ్రవరి–2016 సంచిక చూశాను. పత్రిక చూసిన వెంటనే ఆగలేక, ఆనందాన్ని తట్టుకోలేక మీకు తెలియజేస్తున్నాను. ఈ పత్రిక అద్భుతం. మన పత్రిక 2వ కవర్ పేజీలో ముద్రించిన కథ చాలా గొప్పగా వుంది. ఈ కథలను రాజకీయ నాయకులు, ఎన్నో సంఘాల నాయకులు వారి వారి సమావేశాలు, సభల్లో చెప్పుకుంటే ఎంతోమందికి ఆదర్శంగా వుంటుంది. ఇలాంటి పిట్ట కథలు సమాజానికి ఇవాళ చాలా అవసరమైనవి. అలాగే ఈ పత్రికలో ముద్రించిన కోయిలకుంట్ల నివాసి/ఇన్నోవేటర్ సూర్య తయారు చేసిన ఫేస్ క్రీమ్ కూడా చాలా బాగుంది. నేను వెంటనే సూర్య గారికి ఫోన్ చేసి నా అభినందనలు తెలియజేశాను. వెంటనే నాకు ఒక డబ్బా పంపించ వలసిందిగా కూడా కోరడమైనది. పల్లెసృజన కుటుంబం 'వాట్స్ యాప్' లో మీ చేతికి తగిలిన గాయం కేవలం శ్రీశైలం వల్లనే నయమైందంటే ఆశ్చర్యంగా వుంది. పశ్చిమ గోదావరి జిల్లా సాంప్రదాయ వైద్యుడు రామారావు గారి వైద్య చిట్కాలు కూడా చాలా బాగున్నాయి. వీలైతే ఆయన ఫోన్ నెంబరు పంప గలరు. నేను 'పల్లెసృజన' పత్రికకు వీరాభిమానిని. ఒక సినిమా హీరోకు ఎలా అభిమానులు వుంటారో అలాంటి అభిమానిని నేను. మీరు ఈ పత్రిక ద్వారా వైద్యం, గ్రామీణులకు సలహాలు, రైతులకు సలహాలు అత్యంత సహజ శైలిలో ప్రచురిస్తున్న మిమ్మల్ని అభినందించకుండా వుండలేక పోతున్నాను. ఈ పత్రిక చూసిన మొదటి రోజు నుండే నేను అభిమానిని అయిపోయాను. ఈ పత్రిక ప్రతి ఇంట్లో తప్పకుండా వుండాల్సిన పత్రిక అని నా అభిప్రాయం. రాజకీయ నాయకులు, ఎందరెందరో ప్రజా సేవకులు తాము మాటల్లో మాత్రమే ప్రజా సేవలో పాలు పంచుకుంటున్నట్లు చెబుతుంటారు. కానీ, మీరు అందిస్తున్నదే నిజమైన ప్రజా సేవ అని నా అభిప్రాయం. ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా, ఎవ్వరినీ నిందించకుండా, కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందిస్తున్న పత్రిక మరెక్కడా లేదు అనటంలో అతిశయోక్తి లేదు. మీరు అందిస్తున్న సేవను ఎవ్వరూ మరిచిపోలేరు. ఈ పత్రికకు పని చేస్తున్న అందరూ చాలా గొప్ప వ్యక్తులని నా అభిప్రాయం. ఈ పత్రిక ఒక గ్రంథం లాంటిది. దీన్ని కష్టాల్లో వున్నవారు, జీవితంలో ఎదగాలనుకున్న వారు తప్పకుండా చదవాల్సిన పత్రిక. మార్కెట్లో లభించేలా చేస్తే ఈ పత్రికను కొనటానికి కొందరు ఇష్టపడరు కానీ, ఒక్కసారి కొని చదివిన వాడు మళ్ళీ జీవితంలో దీన్ని మరిచిపోలేడు, వదులుకోలేడు అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. నాకు సమయం దొరికినప్పుడల్లా పాత పత్రికలను కూడా మళ్ళీ తిరిగి చదువుతూ వుంటాను. అలా ఎన్నిసార్లు చదివినా తనివి తీరనంతగా నా మనస్సుకు హత్తుకుపోయిన పత్రిక 'పల్లెసృజన'.

**– జాజి,** రచయిత, కృష్ణా జిల్లా. ఫోన్ ; 99084 11700

**జాజి గారికి,**

పల్లెసృజన పత్రిక అన్నా, దానిలోని వివరాలు, విశేషాలన్నా మీకున్న అభిమానానికి కృతజ్ఞులం. మీరన్నట్లు ఈ పత్రికలోని వివిధ అంశాలు అందరికీ చేరాలన్న కుతూహలం, ఉత్సుకత మాకూ వుంది. ఆ కోరిక తీరాలంటే మీలాంటి వాళ్ళ ప్రోత్సాహంతో వేలకొద్ది పాఠకులు చందాదారులవుతారని విశ్వసిస్తున్నాం. పల్లెసృజన పత్రిక ఒక్కసారి చదివిన వాళ్ళు మళ్ళీ మళ్ళీ చదివేలా చేయటానికే మా అహర్నిశల ప్రయాస. మీలాంటి వాళ్ళ అభిప్రాయాలే మాకు ప్రోత్సాహకాలు. చాపర్ల రామారావు గారి ఫోన్ నెంబరు 96034 30482.

**– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,** ........ 'సూర్య సౌందర్య లేపనం' పైన గతంలో జరిగిన పరిశోధనల గురించి నేను తెలుసుకోవచ్చునా? మా ఫార్మసీ కళాశాలలో దీనిని గురించి తదుపరి పరిశోధనలు చేయమంటారా? దానికెంత ఖర్చవుతుంది. దానిని క్షేమకరంగా వాడవచ్చని మీకెవరైనా చెప్పారా?.......

**– డా. బాపూజీ,** విశ్రాంత సి.ఎస్.ఐ.ఆర్. శాస్త్రవేత్త, బెంగుళూరు.

**బాపూజీ గారికి,** సమయం వెచ్చించి స్పందించినందుకు కృతజ్ఞతలు. మేము మా దృష్టిలోకి వచ్చిన జ్ఞానాన్ని ప్రజల ముందు పెట్టే ప్రయత్నాన్ని చేస్తూ వుంటాము. పై విషయంలో కేవలం సమాచారం మాత్రమే ప్రచురించాము. ఈ దశలో ఇది ఇంకా పరిశోధనాత్మక స్థాయిలోనే వున్నది. తయారు చేసిన వ్యక్తి, దాన్ని వాడిన వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే వ్రాశాము. మేము ప్రచురించే ప్రతి జ్ఞానం మంచి చెడులని నిర్ధారించేందుకు తగ్గ మందీ మార్బలం మావద్ద లేదు. మేము ప్రచురించిన తర్వాత సమాజంలో ఎవరైనా దానిని సమర్థించినా, వ్యతిరేకించినా మాకు సమ్మతమే. అందుకని ప్రతి సారీ "జ్ఞానకర్తతో చర్చించిన తర్వాతే దీనిని వాడండి" అని అతని పూర్తి వివరాలు ప్రచురించడం జరుగుతుంది. ఈ విషయంలో సమాజంనుంచే మాకు సహకారం కావాలి. మీరు మీ కళాశాలలో దీనిపై తదుపరి పరీక్షలు చేస్తానని ముందుకు రావటం ఎంతో ఆనందకరమైన విషయం. కాకపోతే మావద్ద కానీ, మా ఇన్నోవేటర్ వద్ద కానీ దానికి తగ్గ ఆర్థిక స్థోమత లేదు కనుక కళాశాల తరుపున మీరు స్వచ్ఛందంగా చేపడితే బావుంటుంది. మేము అమ్మకానికి పెట్టే వస్తువులు సరియైన నిర్ధారణ జరిగిన తర్వాతనే పెడ్తాము. మీలాంటి శాస్త్రవేత్తలు సహాయం చేస్తానని ముందుకు రావటం మాకెంతో ఆనంద దాయకం.

**– బ్రిగేడియర్ గణేశం.**

**ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.**

# రైతుల కొరకు రైతులు తయారు చేసిన విత్తనాలు

## అభివృద్ధి చేయబడ్డ మేలైన వరి వంగడం

# ఎన్.ఎం.ఎస్-2

**వంగడం పుట్టు పూర్వోత్తరాలు:**

వరి పొలంలో సాధారణం కన్నా పొడవుగా వుండే కంకులు, వాటిలోని నాలుగు రెమ్మలు ప్రత్యేకంగా వుండటం గమనించి, వాటి విత్తనాలను సేకరించాడు. వాటిని వేరువేరు పొలాల్లో నాటగా వాటిలో రెండు చాలా మంచి దిగుబడిని ఇచ్చాయి. ఈ రెండింటిలోనుండి ఒకదానిని ఎంపిక చేసి ఉత్తమమైన దానిగా నిర్ణయించాడు. ఈవిధంగా ఏడు సంవత్సరాల పాటు చేసి, స్థిరంగా వుండే లక్షణాలు గల ఒక రకం వంగడాన్ని ఎంపిక చేయడం జరిగింది.

**ప్రత్యేక లక్షణాలు:**

- అధిక దిగుబడి (హెక్టారుకు 80 క్వింటాళ్ళ వరకు)
- ఇటుక రంగులో వుండే గింజలు.
- పొలంలో గాలికి గింజలు రాలిపోవు.
- ప్రకృతి వైపరీత్యాలను తెగుళ్ళు, క్రిమి కీటకాల ను సమర్థవంతంగా ఎదుర్కోగలదు.



**నమోదు - వితరణ:**

- ఈ వంగడాన్ని ఎన్.ఐ.ఎఫ్. కొత్త ఢిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ పి.పి.వి. & ఎఫ్.ఆర్.ఎ.తో నమోదు ప్రక్రియ ప్రారంభించింది.
- కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది.

**ఇన్నోవేటర్ వివరాలు:**

28 సంవత్సరాల ఎం.కె. శంకర్ గురు సృజనాత్మక రైతు. 1992 నుండే ఈయన కొత్త వంగడాల అన్వేషణ ప్రారంభమైంది. తన తండ్రి, తాతల అడుగు జాడల్లోనే సాంప్రదాయ రకాల విత్తనాల సేకరించి, సాంప్రదాయ పద్ధతిలోనే వాటిని రక్షిస్తున్నాడు. శంకర్ గురు సృజనాత్మకతకు 2015లో రాష్ట్రపతి పురస్కారం లభించింది.



**ఇన్నోవేటర్ చిరునామా:**

శంకర గురు, కర్నాటక., 52, మదరహల్లి గ్రామం, కన్నాహల్లి పోస్ట్,
టి.నర్సిపూర్ తాలూకా, మైసూర్, కర్నాటక. సెల్ ఫోన్ : 99006 58921
లేదా
**క్రియేటివ్ మైండ్స్,** ఇంటి నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500094.
ఫోన్ : **040-27111959,** మొబైల్ : **98660 01678**

PALLESRUJANA Telugu Bi-monthly 20/- March-April- 2016 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**



**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904